మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 6 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 301 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మైక్రోసాఫ్ట్ దారిలో మెటా.. వీఆర్ఎస్



2

ఖర్చుల భారాన్ని తగ్గించుకున్న ఆపిల్



2



రేవంత్ మూడు రోజుల కొడంగల్ పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

9న హకీంపేటలో భారీ రైతు సభలో ప్రసంగం

హైదరాబాద్, నవంబర్ 5 (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈనెల 7, 8, 9 తేదీల్లో సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పర్యటించనున్నారు. సీఎం తన మూడు రోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులు, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా సాధికారతపై దృష్టి సారించనున్నారు. రూ. 9053 కోట్లతో నిర్మించ తలపెట్టిన 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ పాఠశాలల భవనాలను ప్రారంభించనున్నారు. ఈనెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి ఆదర్శ రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అదే రోజు

...మిగతా 2లో

ఇరాన్‌కు సాయం భారతీయ జంటపై అమెరికా ఆంక్షలు

9



కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ

ఈనెలాఖరులో రెండు రోజులు నిర్వహణ

ప్రపంచంతో పోటీ పడేలా పారిశ్రామిక విధానం

గ్లోబల్ సమ్మిట్ బాధ్యత సీనియర్ మంత్రులకు

ఈనెల 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జీవితా బీమాకు శ్రీకారం

డ్యామ్‌ల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు..

వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 05, (మనం బ్యూరో): కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెలాఖరులోగా రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. . ఈ సమావేశంలో ఈమేరకు మంత్రి మండలి

...మిగతా 2లో

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలివే..

- రాష్ట్రవ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం
- పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు.
- లబ్ధిదారులతో కలిసి పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు.
- నవంబరు 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సీఎం కొడంగల్ పర్యటన.
- నవంబర్ 9వ తేదీన కొడంగల్లో భారీ రైతు బహిరంగ సభ.
- నవంబర్ 19వ తేదీన సిద్దిపేటలో భారీ బహిరంగ సభకు నిర్ణయం.
- అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం.
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా..
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం.
- నవంబర్ 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బీమా దరఖాస్తుల సేకరణ.
- ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్ రద్దుకు కేబినెట్ ఆమోదం.
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా ప్రత్యేక కమిషన్ల ఏర్పాటు.
- ఒక్కో కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులు.
- తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్-1999 సవరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం.
- అగ్ని ప్రమాదాల నివారణ, వేగవంతమైన స్పందనకు కొత్త నిబంధనలు.
- సర్వే, సరిహద్దుల చట్టంలో కీలక సవరణకు ఆమోదం.
- అప్పీల్ గడువు 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గింపు.
- రాష్ట్రంలో కొత్తగా 136 కోర్టు ఉద్యోగాల మంజూరుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.
- కాటారం, ఎల్కతుర్తి కోర్టులకు 56 పోస్టులు.
- మరో నాలుగు కోర్టులకు 80 పోస్టుల మంజూరు చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు

బ్యారేజీలు..భద్రం

నిపుణుల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు

డిసెంబర్‌లో పనులు ప్రారంభించండి

దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా దిగువ గోదావరి జలాల సద్వినియోగం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 5 (మనం బ్యూరో): కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

...మిగతా 2లో

పరిశోధనలకు కేంద్రంగా అంతరిక్షం

మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, నవంబర్ 5: అంతరిక్షం.. పరిశోధనలకు కేంద్రంగా మారిందని తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఎన్నో దేశాలు శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతున్నాయని, పదేళ్లలో శాటిలైట్ల సంఖ్య 10 లక్షలకు చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాస్మోసర్వ్ కార్యాలయాన్ని ఢిల్లీ నుంచి కేంద్ర

...మిగతా 2లో



డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో..

తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్

రక్ష ఎక్స్‌పో, ఇండియా జాయ్, క్లైమేట్ కాంక్లేవ్‌లకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రతి ప్రతినిధికి లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించాలె

సమ్మిట్‌లో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యమివ్వాలి

మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 05 (మనం బ్యూరో): డిసెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తెలంగాణ ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రముఖ టూరిస్ట్ స్పాట్‌లను సమ్మిట్‌లో ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో గురువారం గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్ కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ ఆఫీసర్ ని నియమించాలని సూచించారు. ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్న వెంటనే ప్రతినిధుల రిజిస్ట్రేషన్,పాస్ ల ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు సమావేశానికి ముందే పూర్తి సమాచారాన్ని ప్రతినిధులకు అందజేయాలన్నారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి,సెక్యూరిటీ అధికారి నియమించాలని

...మిగతా 2లో

మేం ఇబ్బందుల్లో ఉన్నాం..

వాయిదా వేయండి ఏపీ విజ్ఞప్తి

మురసు తుపాను ఎఫెక్ట్‌తో వాయిదా పడ్డ కేఆర్ఎంబీ భేటీ

జల వివాదాలపై చర్చలకు మరోసారి బ్రేక్

తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్న బోర్డు

హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి: ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై తెలంగాణ, ఏపీలతో చర్చించేందుకు గురువారంనాడు జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మరోసారి వాయిదా పడింది. మురసు తుపాను సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నమై



...మిగతా 2లో

మీరు అదుపులోకి తీసుకున్నదే లెక్క



- వాస్తవ నిర్బంధ సమయం నుంచే 24 గంటల లెక్క పాటించాలి
- నిర్బంధ సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీం సూచన

హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి: అరెస్టు చేసిన వ్యక్తిని కచ్చితంగా 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు

...మిగతా 2లో

వారి గెలుపు మనకు లాభమా?

హెచ్ 1 వీసాలపై ఆశతో యువత



9



ప్రభుత్వ సమాధానాలకు తట్టుకోలేరు

రాహుల్‌పై హోం మంత్రి అమిత్‌షా

చండీగఢ్, నవంబర్ 5: ప్రధాని మోదీ బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తోన్న డిమాండ్‌ను

...మిగతా 2లో



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితులకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

- ఎడిటర్

యేడాదిలోగా బీసీ భవనాలు

38 బీసీ కుల సంఘాల భవనాలకు

రూ. 88.50 కోట్ల నిధులు మంజూరు

నిర్మాణాల్లో జాప్యం సంఘాలదే బాధ్యత: పొన్నం



2

అమెరికా మిడ్‌టర్మ్ ఫలితాలు..

ట్రెండింగ్‌లో హబీబీ మీనింగ్



వాషింగ్టన్, నవంబర్ 5: అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. డెమోక్రాట్లు ఉభయ సభల్లో ఆధిపత్యాన్ని సంపాదించారు. ఈ ఫలితాల అనంతరం నెటిజన్లు 'హబీబీ మీనింగ్' కోసం తెగ వెతుకుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మిషిగన్ సెనేటర్‌గా డెమోక్రాట్ అబ్దుల్ ఎల్ సయెద్ విజయం సాధించారు. ఆ గెలుపు అనంతరం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ 'హబీబీ' అనే అరబిక్ పదం వాడారు. '' జేడీ.. హబీబీ.. జనవరిలో నా ప్రమాణస్వీకారం చేయించాల్సిన బాధ్యత నీపైనే ఉంది. అది నిజంగా విచిత్రమే'' అని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్.. అబ్దుల్ ఎల్ సయెద్‌పై జాతి, మతపరమైన

...మిగతా 2లో

అమెరికాలో ట్రంప్ పార్టీ ఓటమి..

జ్ఞానేశ్‌ను మాకు ఇవ్వవా!

భారత సీఈసీపై మీమ్స్ వెల్లువ

ఢిల్లీ, నవంబర్ 5: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వేచి ఉన్న గదిలోకి ప్రవేశించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'బ్రో.. మాకు జ్ఞానేశ్‌ను ఇవ్వవా!' అని అడుగుతున్నట్టుగా బుధవారం 'ఎక్స్' హ్యాండిల్లో మీమ్‌తో కూడిన పోస్టు వైరల్‌గా మారింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ సారథ్యంలోని రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయానికి గురవడంతో ఈ ఓటమిని భారత రాజకీయ వాతావరణానికి ముడిపెడుతూ



...మిగతా 2లో

మైక్రోసాఫ్ట్ దారిలో మెటా.. వీఆర్ఎస్

ఫ్రాన్స్, నవంబర్ 5: నిర్వహణ వ్యయాలను తగ్గించుకునేందుకు కొన్ని నెలలుగా టెక్ కంపెనీలు వేల మంది ఉద్యోగులను తొలగించాయి. ఇప్పుడూ స్వచ్ఛంద పదవీ విరమణ ట్రెండ్‌ను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ఈ ప్లాన్ను తీసుకొచ్చాయి. తాజాగా వీటి సరసన మెటా కూడా చేరింది.మెటా కంపెనీ వాలంటరీ ఎగ్జిట్ ఆప్షన్‌ను ప్రకటించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. మెటాకు ఫ్రాన్స్‌లో దాదాపు 300 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో సుమారు 100 మందిపై వేటు పడనున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఏ విభాగం సిబ్బందిపై ఈ ప్రభావం పడుతుందో స్పష్టత రావాల్సి ఉంది. వాలంటరీ పదవి విరమణ కోరుకునే ఉద్యోగులు దరఖాస్తు సమర్పించడానికి నవంబర్ 5 డెడ్‌లైన్‌గా నిర్ణయించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ నిర్ణయంపై ఇప్పటికే ట్రేడ్ యూనియన్లతో చర్చలు జరిపినట్లు సమాచారం.గూగుల్ కూడా ఖర్చులను తగ్గించుకోవడానికి వాలంటరీ ఎగ్జిట్లను ప్రకటించింది. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ దేశాల్లోని ఉద్యోగులకు స్వచ్ఛంద విరమణ ఆఫర్ను తీసుకొచ్చింది. ఇప్పటికే ప్రముఖ కంపెనీ మైక్రోసాఫ్ట్ కూడా పలు స్థాయిల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 వేల మంది ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ అవకాశం ప్రకటించిన విషయం విదితమే.

ఖర్చుల భారాన్ని తగ్గించుకున్న ఆపిల్

న్యూయార్క్, నవంబర్ 5: ప్రముఖ టెక్ కంపెనీలు ఓవైపు ఏఐని ప్రోత్సహిస్తునే.. మరోవైపు అదనపు ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికా దిగ్గజ కంపెనీ యాపిల్ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. తన ఉద్యోగుల రోజువారీ ఏఐ ఖర్చులపై కోత విధిస్తున్నట్లు బ్లూమ్బర్గ్ నివేదిక పేర్కొంది. అయితే ఉద్యోగులకు అదనపు నిధులు అవసరమైతే మాత్రం ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించిందట.

ఖర్చుల నియంత్రణలో భాగంగా.. ఇప్పటికే కొంతమంది ఇంజినీర్లకు రోజువారీ ఏఐ బడ్జెట్ను 300 డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.28 వేలు) నుంచి 200 డాలర్లకు తగ్గించిందని, భవిష్యత్తులోనూ మరింత కోతలు విధించే అవకాశం ఉన్నట్లు సదరు నివేదిక పేర్కొంది. విభాగాలను బట్టి ఏఐ కోతలను 25 డాలర్లకు (దాదాపు రూ.2350) కుదించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యాపిల్ ఉద్యోగులు చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినై వంటి ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్నారు. అయితే, ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఉబర్, మెటా, టెస్లా, యాక్సెంచర్ వంటి ఇతర ప్రముఖ కంపెనీలు కూడా ఏఐ ఖర్చులను తగ్గించుకోవడానికి ఇటీవల కొన్ని పరిమితులను తీసుకొచ్చాయి.

ట్రెండింగ్‌లో హబీబీ మీనింగ్

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు చేశారు. ప్రచార సమయంలో అబ్దుల్ పేరును ట్రంప్ హేళన చేశారు. అమెరికా చట్టాల ప్రకారం.. ఉపాధ్యక్షుడు సెనెట్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు. దాంతో కొత్తగా ఎన్నికైన సెనేటర్లతో జేడీ వాన్స్ ప్రమాణస్వీకారం చేయించాల్సి ఉంటుంది. రిపబ్లికన్ నేతల విద్వేష వ్యాఖ్యలకు అబ్దుల్ ఇలా 'హబీబీ' అంటూ తిప్పికొట్టారు. అప్పటి నుంచే ఈ వర్డ్ ట్రెండ్ అవుతోంది. దాని అర్థం కోసం నెటిజన్లు వెతుకుతున్నారు. 'హబీబీ' అంటే మై లవ్ అని అర్థం. మామూలుగా స్నేహితులు, కుటుంబ సభ్యులను ప్రేమగా పిలిచేందుకు ఈ పదాన్ని వాడుతుంటారు.

జ్ఞానేశ్‌ను మాకు ఇవ్వవా!

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు వెల్లువెత్తాయి. భారత ప్రతిపక్షాల 'ఓట్ చోరీ' ఆరోపణలకు కేంద్రబిందువుగా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వాటన్నింటిలోనూ కీలకంగా మారారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడైన అభిజీత్ దీప్కే ''జ్ఞానేశ్‌కుమార్ ఉంటే ట్రంప్‌నకు ఈ పరిస్థితి వచ్చేది కాదు'' అంటూ 'జస్ట్ సేయింగ్' అనే హ్యాష్ ట్యాగ్ ద్వారా వ్యాఖ్యానించారు. 'ట్రంప్‌నకు ఇప్పుడు జ్ఞానేశ్ అవసరం చాలా ఉంది' అంటూ మరొకరు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ''ట్రంప్ సాహెబ్! మీరు జ్ఞానేశ్‌ను తీసుకొని ఉంటే.. ఇటువంటి రోజును చూడాల్సిన పరిస్థితి వచ్చేది కాదు'' అని కాంగ్రెస్ పార్టీ మీడియా అండ్ పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పవన్‌ఖేడా సైతం 'ఎక్స్' ద్వారా వ్యాఖ్యానించారు. సామాజిక కార్యకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని సైతం ఇందులోకి లాగారు. ''ఐ యామ్ సారీ మై ఫ్రెండ్! జ్ఞానేశ్‌ను పంపలేను. ముందు మా సంగతి చూసుకోవాలి కదా! అయినా ఈమధ్య ప్రజలు ఆయనను ఇంటి నుంచి బయటకు రానివ్వడం లేదు. ఇప్పుడు నాకు కూడా సహాయం చేసే పరిస్థితిలో ఆయన లేరు'' అని మోడీ చెబుతున్నట్టుగా ఆయన పోస్టు పెట్టారు. ఇంకొందరు వ్యంగ్య వార్తా కథనాలు పోస్టు చేశారు. 'మధ్యంతర ఎన్నికల ఫలితాలు ట్రంప్‌నకు ప్రతికూలంగా వస్తుండటంతో జ్ఞానేశ్‌కుమార్ అమెరికాకు బయలుదేరారు'.. 'ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణపై అక్కడి అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రంప్ వినతిపై జ్ఞానేశ్ అమెరికాకు వెళ్లనున్నట్లు సమాచారం' అంటూ అవి కొనసాగాయి.

ప్రభుత్వ సమాధానాలకు తట్టుకోలేరు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుపట్టారు. రాజకీయ చర్చను వీధుల్లో కాకుండా పార్లమెంట్లో పెట్టాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానాలను రాహుల్ తట్టుకోలేరని ఎద్దేవా చేశారు. ''బాధ్యతాయుతమైన చర్చ జరగాలని మీరు అనుకుంటే.. మీ ఆందోళనల్లో సత్యం, తర్కం ఉంటే.. రండి పార్లమెంట్‌లో చర్చించుకుందాం. ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకుందాం. కానీ, మా సమాధానాలను మీరు తట్టుకోలేరు. ఎప్పటిలాగే పారిపోతారు. పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుంది. బాయ్‌కాట్‌లను రాజకీయ వ్యూహంగా మార్చుకుంది. పార్లమెంట్లో కీలకమైన చర్చలను తప్పించుకుంటూ.. గందరగోళం సృష్టించేందుకు వీధుల్లో జనాలను సమీకరించుకుంటున్నారు'' అని హరియాణాలో జరిగిన సభలో అమిత్ షా మండిపడ్డారు.

హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో అమిత్షా, ఇతర కీలక నేతలంతా 'లోక్‌తంత్ర బచావో, అరాజకతా హటావో' పేరిట పాదయాత్రలో పాల్గొన్నారు. సర్‌పై చర్చించేందుకు పార్లమెంట్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. ''2014లో సర్ ఉందా..? అయినా సరే మీ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. 2019, 2024లోనూ మీకదే పరిస్థితి. అప్పుడు కూడా సర్ లేదు. వీధుల్లో జనాలను సమీకరించే ప్రయత్నాలను రాహుల్ కొనసాగిస్తే.. బీజేపీ నుంచి తగిన సమాధానం వస్తుంది'' అని పేర్కొన్నారు.

దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు రావాలని రాహుల్ డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. మోడీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభలో చర్చ అంటారుకానీ తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని ఆరోపించారు.

మీరు అదుపులోకి తీసుకున్నదే లెక్క

(మొదటి పేజీ తరువాయి)

కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఇటీవల త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదని చెప్పింది. ఇక, సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరిచినంత మాత్రాన నిర్బంధం చట్టబద్ధమైనట్లు కాదని ధర్మాసనం తెలిపింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 58 ప్రకారం.. కేసు పరిస్థితులకు అనుగుణంగా నిర్బంధ సమయం సహేతుకంగా ఉండేలా దర్యాప్తు సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు అతడి స్వేచ్ఛకు భంగం కలిగించిన అసలు తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు పాటించారా? లేదా? అన్నది స్వతంత్రంగా పరిశీలించాలని సూచించింది. నిర్బంధం సహేతుకమైన సమయాన్ని మించిందని భావిస్తే తదుపరి రిమాండ్‌కు అనుమతి నిరాకరించే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

డిసెంబర్ 7 నుండి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో.. తెలంగాణ ఇన్వెస్ట్ సమ్మిట్



(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టూరిజానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలనీ, రాష్ట్రంలోని ప్రముఖ టూరిస్ట్ స్పాట్ లను గ్లోబల్ సమ్మిట్ లో ప్రదర్శించాలని చెప్పారు. వాతావరణ మార్పుల పైన గ్లోబల్ సమ్మిట్ లో ప్రత్యేక చర్చ జరిగేలా చూడాలనీ, అలాగే, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ ఎడ్యుకేషన్ ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ లో చర్చ జరగాలని నిర్దేశించారు. ఎల్నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమ్మిట్ నిర్వహణ కోసం నవంబర్ 15 వరకు ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలనీ, గ్లోబల్ సమ్మిట్ కి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించి వారంతా సమ్మిట్‌కు హాజరయ్యేలా చూడాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

యేడాదిలోగా బీసీ భవనాలు

హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి: తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. అయితే, వీటి పనులన్ని సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. ఇదిలాఉంటే, బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చి చెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్ణీత సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని బీసీ కుల సంఘాలు సమావేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించారు.

రేవంత్ మూడు రోజుల కొడంగల్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఈనెల 8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం సమావేశం కానున్నారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు. రూ5060 కోట్లతో కొత్వాల్‌గూడ-నాచారం రేడియల్ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. కొడంగల్‌లో రూ.123 కోట్లతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ.118.80 కోట్లతో ఏర్పాటు చేసే 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, కళాశాలలు, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతారు. నవంబర్ 9న హకీంపేటలో భారీ రైతు సభలో సీఎం ప్రసంగించనున్నారు. ఈ సభకు 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

బ్యారేజీలు..భద్రం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అక్కడ కనిపించే నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్డీఎస్ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే..ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలన్నారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



పరిశోధనలకు కేంద్రంగా అంతరిక్షం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నిరుపయోగ శాటిలైట్లను కక్ష్య నుంచి వెనక్కి తేవడం ముఖ్యమన్నారు. దేశంలో తొలిసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ తరహా ప్రయోగం చేపడుతున్నట్లు చెప్పారు. '' కాస్మోసర్వ్ కంపెనీ అంతరిక్షం నుంచి వ్యర్థాలు తెచ్చే సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో స్పేస్ కంపెనీలు పని చేస్తున్నాయి. వీటికి ప్రోత్సహించేందుకు స్పేస్‌టెక్ పాలసీ తీసుకొస్తాం. ఫ్యూచర్ సిటీలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం'' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

వాయిదా వేయండి
ఏపీ విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నందున ఈ భేటీని వాయిదా వేయాలని పొరుగు రాష్ట్రం ఏపీ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని బోర్డు ఆమోదించింది. అయితే, తుపాను ప్రభావం వల్ల అధికారులు ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా కూడా సమావేశానికి హాజరయ్యే పరిస్థితి లేదని ఏపీ ప్రభుత్వం ఖచ్చితంగా బోర్డుకు విజ్ఞప్తి చేసింది. తుఫాన్ విపత్తు నేపథ్యంలో వారి కీలక విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, ఎట్టకేలకు ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉభయ రాష్ట్రాల అధికారులు అందుబాటులోకి వచ్చిన అనంతరం తదుపరి తేదీని వెల్లడిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అయితే, ఈ సమావేశం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. తొలుత అక్టోబరు 1న, అనంతరం అక్టోబరు 26న నిర్వహించాలని భావించినప్పటికీ వీలుపడలేదు. గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటన కారణంగా వాయిదా పడగా, తాజాగా తుపాను పరిస్థితుల దృష్ట్యా మరోసారి వాయిదా పడింది. ఈ తాజా వాయిదాతో ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న కీలకమైన కృష్ణా జలాల పంపిణీ, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ, తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులు వంటి అంశాలపై చర్చలు మరోసారి నిలిచిపోయాయి. తదుపరి సమావేశం ఎప్పుడు జరుగుతుందనే దానిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)



కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడేళ్లుగా చేస్తున్న మరమ్మతుల గురించి అసెంబ్లీలో వివరించాలనీ, గడిచిన మూడేళ్లుగా ఈ ప్రాజెక్టుకు చేపడుతున్న మరమ్మతులు, అయిన ఖర్చు, అలాగే ప్రస్తుతం ప్రాజెక్టు భద్రతకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను సభ వేదికగా ప్రజలందరికీ వివరించాలని రాష్ట్ర కేబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం పరివాహక జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు గోదావరిని సందర్శించాలని మార్గనిర్దేశం చేశారు. గోదావరి నుంచి నీటి ప్రవాహం, ఎత్తిపోతల ప్రక్రియలను క్షేత్రస్థాయిలో వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

గోదావరి వద్దే మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలించారనే ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న విమర్శలను వెంటనే తిప్పి కొట్టాలని ఆదేశించారు. రాష్ట్ర క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు ఉంటాయని తెలిపారు. ప్రపంచదేశాల నుంచి పెట్టుబడిదారులు వస్తారని భావిస్తున్నామనీ, రైజింగ్ తెలంగాణను మరింత ముందుకు తీసుకు వెళతామని వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ బాధ్యతను సీనియర్ మంత్రులకు కేటాయించారు.

రెండో గ్లోబల్ సమ్మిట్‌పై దీర్ఘంగా చర్చించాం. సమిట్ సందర్భంగా భారీగా పెట్టుబడులు వస్తాయని విశ్వాసం ఉంది. కాళేశ్వరంలో నీళ్లు నిలపవద్దన్న ఎన్‌డీఎస్ఏ ఆదేశాలను అమలు చేశామని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ చెప్పిన అన్ని పరీక్షల్ని పూర్తి చేసి నివేదించామనీ, పారదర్శకంగా ప్రాజెక్టు మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తేవాలని నిర్ణయించామని వెల్లడించారు.

నవంబరు19వ తేదీన సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత భీమా, ఇందిరమ్మ చీరల పంపిణీ పథకాలను ప్రారంభిస్తామనీ, సిద్దిపేట వేదికగా ఈ రెండు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. డ్రాస్టివెల్లా స్పిల్వే అప్రాన్ నిర్మాణంపై నిపుణులు నిర్దిష్ట సూచనలు చేశారని మంత్రి పొంగులేటి చెప్పారు. స్పిల్వే అప్రాన్ ఎంత వెడల్పు, ఎంత మందంతో నిర్మించాలనే అంశాలపై నివేదికలు సిద్ధమయ్యాయని తెలిపారు.

సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా బ్యారేజీల మరమ్మతులు చేపడతామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. మూడు బ్యారేజీలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కేబినెట్లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బ్యారేజీల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మధుయాష్కితో ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి భేటీ

ఎన్నికల ప్రచారానికి రావాలని ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 05, (మనం బ్యూరో): వరంగల్- ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌తో గురువారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సర్వోత్తమ్ రెడ్డి కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను వివరించి ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు సహకారం అందించాలని, ప్రచారానికి రావాలని మధుయాష్కిని ఆహ్వానించారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాకు చెందిన చాలామంది గ్రాడ్యుయేట్స్ ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివాసం ఉంటున్న విషయంపై చర్చించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉంటున్న ఓటర్ల కు సంబంధించి తన సహకారం పూర్తిగా ఉంటుందని.. వనస్థలిపురంలో ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎన్నికల ప్రక్రియ కోసం వినియోగించుకోవచ్చని ఈ సందర్భంగా మధుయాష్కి సర్వోత్తమ్ రెడ్డికి సూచించారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల బకాయిలు చెల్లించండి

సీఈఓను కోరిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు లచ్చిరెడ్డి



హైదరాబాద్, నవంబర్ 5(మనం బ్యూరో): రాష్ట్రంలో వివిధ ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కోరారు. తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికలు-2023, లోక్‌సభ ఎన్నికలు-2024 సందర్భంగా రిటర్నింగ్ , సహాయ రిటర్నింగ్ అధికారులుగా చేసిన వ్యయాలు, కేటాయించిన బడ్జెట్‌ను మించిపోయాయని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి గుర్తు చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అదనపు బడ్జెట్ మంజూరు చేయాలని కోరారు. ఈమేరకు గురువారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం నాయకులు శకుంతల, లావణ్య, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా అధ్యక్షురాలు రాధ, శ్రీకాంత్, వెంకట లక్ష్మితో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఎన్నికలకు సంబంధించిన పెండింగ్, అదనపు బిల్లులను మంజూరు చేయాలని వినతి పత్రం అందచేశారు . ఎన్నికల సమయంలో వివిధ ఖాతాల కింద కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో పలు అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో అదనపు ఖర్చులు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఖర్చులను అప్పుల రూపంలో సమకూర్చుకోవాల్సి వచ్చిందని, సంబంధిత బిల్లుల చెల్లింపులు ఇప్పటికీ పెండింగ్ లో ఉన్నాయని గుర్తు చేశారు. బకాయిల చెల్లింపుల కోసం కొందరు రుణం ఇచ్చినవారు కోర్టులను ఆశ్రయించగా, మరికొందరు అప్పటి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాలు అధికారులకు ఇబ్బందికరంగా మారడమే కాకుండా వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే ఎన్నికల నిర్వహణలో చేసిన అదనపు వ్యయాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను తక్షణమే పరిశీలించి, అదనపు బడ్జెట్‌ను మంజూరు చేయాలని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఆధికారి సుదర్శన్ రెడ్డిని కోరారు.

కాంగ్రెస్ బీసీల ద్రోహి

రేవంత్‌ది సర్వ భ్రష్ట ప్రభుత్వం : మధుసూదనా చారి

కేసీఆర్ బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడితే రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండు

కోకాపేటలో ఆత్మగౌరవ భవనాలు : ఎమ్మెల్యే గంగుల కమలాకర్

హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి : ఉద్యమ నేత, బీఆర్ఎస్ దళపతి, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు కడుపు నిండా అన్నం పెట్టి కాపాడారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. కానీ, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు వ్యతిరేకంగా చీకటి జీవో జారీ చేసిండని ఫైర్ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మధుసూదనాచారి, శ్రవణ్ కుమార్, విప్ వివేకానంద, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలంతా ఒకసారి మీకు గత చరిత్రను పత్రికల ద్వారా ప్రజలకు చెప్పాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2011-12 సంత్సరంలో పొన్నం ప్రభాకర్ కూడా బీసీ సంఘాల్లో తిరిగిండన్నారు. తాను కూడా బీసీ సంఘాల్లో తిరిగానని ఎమ్మెల్యే గంగుల గుర్తు చేశారు. ఆనాడు సీఎం కిరణ్ కుమార్ ఈ హైదరాబాద్ నడిఒడ్డున బీసీ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే.. మా బీసీ సంఘాలకు హోటళ్లలో కూడా మీటింగ్ ఉండదు కాబట్టి ఎక్కడన్నా చుట్టు పక్కల బీసీ సంఘాలకు 5 గుంటల భూమి ఇవ్వండి అంటే వెకిలిగా నవ్విండన్నారు.

బీసీ సంఘాలకు ఒక ఆశ్రమం కావాలా..? అని నవ్విన పరిస్థితి ఉండేదన్నారు. తిరుగంగా తిరుగంగా సాగర్ రోడ్డులో ఓ 120 కిలోమీటర్ల దూరంలో 5 గుంటల భూమిని ఒక స్మశాన వాటిక పక్కన చూపించిన పరిస్థితి ఉన్నదన్నారు. అంటూ బీసీ సంఘాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వమున్నప్పుడు వెకిలిగా నవ్వి అవమానం చేసిన పరిస్థితి ఉండేదన్నారు.

కోకాపేటలో ఆత్మగౌరవ భవనాలు..

కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే హైదరాబాద్‌లో ఒక గుంట భూమి కూడా లేని పరిస్థితి ఉంది. ఆ పరిస్థితి తెలుసుకుని కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే.. బీసీలంటే సమాజంలో 60-70 శాతమున్న వ్యక్తులు కాబట్టి మీ ఓట్లతోనే ప్రభుత్వాలు నడుస్తయి కాబట్టి మీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మాది ప్రప్రథమంగా, ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనటువంటి విధంగా ఆ రోజు 2018లో జీవో నంబర్ 189 ప్రకారం మీ గౌరవాన్ని కాపాడుతం..అందుకే దాని పేరు ఆత్మ గౌరవ భవనాలని చెప్పారని ఎమ్మెల్యే గంగుల స్పష్టం చేశారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని సాహసం జీవో 189 ద్వారా 87.5 ఎకరాల భూమి.. ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఆ డబ్బు కూడా నేను ఇస్తా అని చెప్పి ఎకరానికి కోటి రూపాయల చొప్పున 41 ఈ బీసీ కుల సంఘాలకు సుమారు 97.5 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. ఎక్కడిస్తారని అంటే.. మీ గౌరవాన్ని కాపాడతా అని చెప్పి రూ.100-150 కోట్ల విలువైన కోకాపేటలో మా అందరికీ ఆత్మగౌరవ భవనాలు ఇచ్చారన్నారు. దాంతోపాటు ఉప్పల్ భగాయత్లో ఇచ్చారన్నారు. ఆ తర్వాత మా దగ్గరకు సంఘాలు వచ్చినయి.. మేం సంతోషపడ్డాం. ముఖ్యమంత్రి కూడా కడుపునిండా అన్నం పెట్టి మా గౌరవాన్ని కాపాడిండని మా అదృష్టంగా భావించామన్నారు. కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్న రేవంత్ ప్రభుత్వం చీకటి జీవో 14 ఇవ్వడం జరిగింది. ఇందులో పాత 189 జీవోను రద్దు చేస్తున్నం.. ఇక నుంచి మాదే గుత్తాధిపత్యం.. మళ్లీ మీరు బానిసలుగా బతకండి.. గతంలో మా హయాంలో మీరు బానిసలుగాఉన్నరు.. మళ్లీ మీరు బానిసలుగా ఉండండి.. మీ ఆత్మగౌరవ భవనాలు లేవు.. మేమే ఆధిపత్యం చేస్తమని జీవో నంబర్ 14 ఇవ్వడం జరిగింది. పొన్నం ప్రభాకర్ మీరు బీసీ బిడ్డ. బీసీ సంఘాల్లో తిరిగినం. ఈ జీవో ఇచ్చింది మీకు తెలుసా..? మీ డిపార్ట్‌మెంట్ ఇచ్చిందన్నారు. మరి జీవో ఇచ్చినంక కూడా మీరు ఎందుకు పెదాలు మెదపడం లేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ బీసీల ద్రోహి.. రేవంత్‌ది సర్వ భ్రష్ట ప్రభుత్వం : మధుసూదనా చారి

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కేసీఆర్ పిలుపు మేరకు బీసీ జాతి మొత్తం స్పందించి తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి కారణబూతమైందని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలి.. బీసీలు అన్ని రకాలుగా ఎదగాలి.. బీసీలకు బ్రహ్మాండమైన వేదికలుండాలి.. చైతన్యవంతమైన బీసీ సమాజమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అనే సదుద్దేశంతో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ నేతృత్వంలో ఆత్మగౌరవ భవనాల కోసం స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం గడిచిన అనేక దశాబ్దాలుగా.. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కానీ.. ఈ రోజు జరుగుతున్న పరిణామాల పరంపరలో కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి అని మధుసూదనా చారి ఫైర్ అయ్యారు. కారణమేంటంటే మేం గతంలో శాసనసభ్యులుగా కొనసాగినప్పుడు, రాజకీయాల్లో ఉన్నప్పుడు బీసీల విషయాల్లో గతంలో ఉన్న ప్రభుత్వాలను 500 గజాలు, 1000 గజాలు బీసీల కోసం తీసి భవనాల కోసం కేటాయించండి అని అనేక దశాబ్దాల పాటు ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చినా ఏ రోజూ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు. దానికి భిన్నంగా ఈ రోజు ఆత్మగౌరవ భవనాల కోసం ఆ కులం జనాభా దామాషాకు అనుగుణంగా 2 ఎకరాలు, 3 ఎకరాలు, 5 ఎకరాలు, 10 ఎకరాలు స్థలాలు కేటాయిస్తే.. ఈ భవనాల నిర్మాణం జరిగితే ఇవి వారి వేదికలుగా తయారై వారు సంఘటితం కావడానికి, శక్తిగా ఎదగడానికి ప్రభుత్వాలు చేస్తున్న దుర్మార్గాన్ని ప్రశ్నించేట్వంటి వేదికలుగా తయారవుతాయి కాబట్టి అది జరుగకూడదనే కుట్రతో చేసిన దుర్మార్గపు నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 3 సంత్సరాలుగా రాష్ట్రంలో కొనసాగుతున్నది సర్వ భ్రష్ట ప్రభుత్వమని మండిపడ్డారు. కారణమేంటంటే ఇక్కడ కృష్ణా, గోదావరి నదులున్నా అనేక వేల టీఎంసీల వర్షం కురుస్తున్నా.. ఆ కురిసిన నీళ్లను ఒడిసి పట్టుకొని సద్వినియోగం చేసే ప్రాజెక్టుల నిర్మాణం జరిగినా వాటిని సద్వినియోగం చేసే ఆలోచన కానీ, అవగాహన కానీ లేదన్నారు.

కండక్టర్ మృతితో ఆర్‌టీసీలో కనువిప్పు

డోర్లు మూస్తేనే బస్సు ముందుకు.. ఆర్‌టీసీ కీలక నిర్ణయం

ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్‌టీసీ

డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి : రాష్ట్రంలో ఓ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. తెలంగాణ ఆర్‌టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్‌టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది. ఇకనుంచి తెలంగాణ వ్యాప్తంగా ఆర్‌టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు మళ్లి పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్‌టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చేతులు కాలకా ఆకులు పట్టుకున్న చందంగా ప్రవళిక కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం, ఆర్‌టీసీ సంయుక్తంగా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏది ఏమైతేనేం.. ఒకరి మృతి తర్వాత స్పందించిన ఆర్‌టీసీ ముందే ఇలాంటి చర్యలు తీసుకుంటే? ఈ ఘటన జరిగి ఉండకపోయేదని అటు ఆర్‌టీసీ సంఘాలతో పాటు ఇటు ప్రతి పక్ష పార్టీలతో పాటు ప్రజా సంఘాలు సైతం పెదవి విరిశాయి. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి ఫైనల్‌గా, కూతురు మృతితో ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో పాటు ఆర్‌టీసీ ప్రత్యేక పాలసీ ద్వారా మరో రూ.కోటి ప్రమాద బీమా కూడా కుటుంబానికి అంద చేయనున్నట్లు చెప్తూ ఆర్‌టీసీ చేతులు దులుపుకుంది.

బీఆర్ఎస్‌లోకి

వలసల జోరు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేటీఆర్
- గులాబీ పార్టీలో చేరిన నిర్మల్ యువ నేత నల్ల వినయ్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 5(మనం ప్రతినిధి): తెలంగాణలో గత కొంత కాలంగా ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారంనాడు నిర్మల్ జిల్లాకు చెందిన యువ నేత నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిర్మల్ జిల్లాలో మాజీ సమితి ప్రెసిడెంట్ భీమిరెడ్డి మనవడిగా వినయ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉండటంతో పాటు, స్థానికంగా ప్రజల్లో ఆదరణ ఉన్న యన బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలం చేకూరనుందని పేర్కొన్నారు. ఇదిలాఉంటే, ఈ నెల 11న నిర్మల్లో కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా రైతు గర్జన బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో పార్టీలోకి యువ నాయకుల చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

రాజధానిలో గంజాయి సప్లై నెట్‌వర్క్ గుట్టురట్టు

- నిందితుల అరెస్ట్..
- 10 నెలల్లో 400 కిలోల గంజాయి విక్రయం
- అక్రమ వ్యాపారం ద్వారా రూ.1.8 కోట్ల అమ్మకాలు
- ఈగల్ ఫోర్స్ అధికారులు వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 5(మనం ప్రతినిధి): హైదరాబాద్ కేంద్రంగా గంజాయి అమ్ముతున్న అస్సాం గ్యాంగ్‌ను ఈగల్ ఫోర్స్, చౌటుప్పల్ స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో బాగంగా ఐదుగురు నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నారు. ముఠా కీలక సూత్రధారి భాస్కర్ సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 24.7 కిలోల గంజాయి, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్‌లో ఈ ముఠా విక్రయిస్తోందని అధికారులు తెలిపారు. కొరియర్లు, ప్యాకర్లు, డెలివరీ నెట్‌వర్క్ ప్రధాన నిందితుడు భాస్కర్ ఏర్పాటు చేసుకున్నాడు. గత 10 నెలల్లో సుమారు 400 కిలోల గంజాయి విక్రయించినట్లుగా పోలీసులు గుర్తించారు. గంజాయి వ్యాపారం ద్వారా రూ.1.8 కోట్ల అమ్మకాలు జరిపినట్లుగా ఈగల్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

కుత్బుల్లాపూర్లో గంజాయి మొక్కల సాగు..

కుత్బుల్లాపూర్ సూరారం పోలీస్ స్టేషన్ పరిధి కైసర్ నగర్‌లో అక్రమంగా గంజాయి మొక్కల సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అల్లాపూర్కు చెందిన వెల్డర్ ఎండీ అయాజ్ వ్యాస్ (54)గా నిందితుడిని గుర్తించారు. కైసర్ నగర్‌లో ఓపెన్ ప్లాట్‌లో 5 అడుగులు, 4 అడుగుల ఎత్తు పెరిగిన 2 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్కు సూరారం పోలీసులు తరలించారు.

సర్వే చేయండి?.. లేదంటే? ‘రెడ్ మార్క్’ తప్పదు?

- అయ్యప్ప సొసైటీపై రేవంత్ సర్కారుకు నెల రోజుల డెడ్‌లైన్
- కాంగ్రెస్ వచ్చాక అక్రమ నిర్మాణాలు జరిగాయ్?
- టీఆర్ఎస్ అధినేత్రి కవిత

హైదరాబాద్, నవంబర్ 5(మనం ప్రతినిధి): హైదరాబాద్ ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి, మాజీ ఎంపీ కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు ‘రెడ్ మార్క్’ వేస్తారని హెచ్చరించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

యథేచ్ఛగా అండాల వ్యాపారం

పుట్ట గొడుగులుగా వెలసిన ఐవీఎఫ్ సెంటర్లు

కొరవడిన నియంత్రణ.. మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లిన అక్రమ వ్యాపారం

హైదరాబాద్‌లో అక్రమంగా అండాల సేకరణ కేసు..

రంగంలోకి దిగిన సీపీ సుమతి, 22 ఫెర్టిలిటీ సెంటర్లపై నిఘా



హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. నిరుపేద మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా అండాలను సేకరించిన వ్యవహారంపై మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో 3 ఆస్పత్రుల పాత్రను గుర్తించామని.. 22 ఫెర్టిలిటీ సెంటర్లతో ఏఆర్‌టీ కేంద్రాలకు ఉన్న సంబంధాలను పరిశీలిస్తున్నామని సీపీ సుమతి వెల్లడించారు. ఈ దందా వెనుక మరికొందరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల వద్ద లభించిన హార్మోన్ల ఇంజెక్షన్లను ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. వాటిని బాధితులకు వినియోగించారా లేదా అన్నది నివేదికతో తేలనుందని పేర్కొన్నారు. మరోవైపు బాధిత మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించగా కొందరిలో ఆరోగ్య సమస్యలు గుర్తించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈ కేసులో నిందితుల వద్ద హార్మోన్ల ఇంజెక్షన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటిని బాధిత మహిళలకు నిజంగానే ఇచ్చారా అనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదని సీపీ సుమతి తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపించామని.. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాతే ఈ అంశంపై స్పష్టత వస్తుందని చెప్పారు. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) కేంద్రాల నుంచి ఫెర్టిలిటీ సెంటర్లకు అండాల దానం ప్రక్రియకు సంబంధించిన సమాచారం, పత్రాలు చేరాల్సి ఉంటుందని సీపీ సుమతి వివరించారు. ఈ అక్రమ వ్యవహారంలో బాధితులుగా గుర్తించిన సుమారు 30 మంది మహిళలకు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీపీ సుమతి వెల్లడించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్తో పాటు రక్త పరీక్షలు కూడా చేశారు. వారిలో కొందరికి అండాల సేకరణ తర్వాత ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లు పరీక్షల్లో గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బాధితులకు అందిన వైద్య చికిత్స, అండాల సేకరణ జరిగిన విధానం, ఉపయోగించిన మందుల వివరాలపై పోలీసులు దృష్టి సారించారు.

తొలుత వ్యభిచార సంబంధిత కార్యకలాపాలపై వచ్చిన సమాచారంతో విచారణ ప్రారంభించగా.. ఆ తర్వాత అక్రమ అండాల సేకరణ వ్యవహారం బయటపడినట్లు సీపీ సుమతి వెల్లడించారు. ఈ దందాలో మహిళలను తీసుకొచ్చే ఏజెంట్లు, మధ్యవర్తులు, వైద్య ప్రక్రియకు సహకరించిన వారి పాత్రలను వేర్వేరుగా పరిశీలిస్తున్నారు. కేసులో సంబంధం ఉందనే కారణంతో ప్రతి ఒక్కరినీ నిందితులుగా చేర్చబోమని.. ఎవరి పాత్రకు సంబంధించి ఆధారాలు లభిస్తాయో వారిపైనే చర్యలు తీసుకుంటామని సీపీ సుమతి స్పష్టం చేశారు. అండాల ఉత్పత్తిని పెంచేందుకు సాధారణంగా కొన్ని రోజులపాటు మహిళలు, యువతులకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారని డాక్టర్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియ వైద్యుల పర్యవేక్షణలో జరగకపోతే ఓవేరియన్ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ (ఓహెచ్ఎస్ఎస్) వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అండాశయాలు వాపునకు గురికావడం, పొత్తికడుపులో ద్రవం చేరడం, రక్తం గడ్డకట్టడం, మూత్రపిండాల పనితీరుపై ప్రభావం పడటం వంటి సమస్యలు రావచ్చని పేర్కొంటున్నారు. అలాగే శుభ్రత పాటించని పరికరాలతో ఈ ప్రక్రియను నిర్వహిస్తే ఇన్ఫెక్షన్లు, అంతర్గత రక్తస్రావం వంటి ప్రమాదాలు ఉంటాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన వైద్య సదుపాయాలు, అత్యవసర చికిత్స అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మార్చవచ్చని చెబుతున్నారు. పదేపదే అండాలను సేకరించడం వల్ల భవిష్యత్తులో సంతానోత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు.

అండాల దానంపై చట్టం ఏం చెబుతోంది?

దేశంలో అండాల సేకరణ, దానం, నిల్వ, వినియోగాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం-2021ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం అండాల దాత తన జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే అండాలను దానం చేయాలి. ఒక దాత నుంచి గరిష్ఠంగా 7 అండాలను మాత్రమే సేకరించాలి. ఒక దాతకు చెందిన అండాలను ఒకే జంటకు మాత్రమే అందించాలి. ఈ ప్రక్రియలో దాతకు రాతపూర్వక సమ్మతి, 12 నెలల బీమా రక్షణ తప్పనిసరి అని పేర్కొంది. అంతేకాకుండా అండాల సేకరణ, నిల్వ వంటి ప్రక్రియలు చట్టబద్ధంగా నమోదైన ఏఆర్టీ బ్యాంకులు, కేంద్రాల ద్వారానే జరగాలి. అనుమతులు లేకుండా అండాలను సేకరించడం, నిబంధనలను ఉల్లంఘించడం, మహిళలను మోసపూరితంగా ఈ ప్రక్రియలోకి తీసుకురావడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్లో బయటపడిన వ్యవహారంలో ఈ నిబంధనలు ఏ మేరకు ఉల్లంఘించారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎఫ్ఎస్ఎల్ నివేదిక, వైద్య పరీక్షల ఫలితాలు, స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

దీపావళి కానుక

ప్రయాణికులకు తీపి కబురు

సగానికి పైగా తగ్గనున్న మెట్రో ఆర్‌టీసీ కామన్ పాస్ ధరలు

డైలీ పాస్ రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం

మంత్లీ పాస్ రూ.8,500 నుంచి రూ.4,000–4,500కు తగ్గింపు

దీపావళి నుంచి అమల్లోకి రానున్న సవరించిన కొత్త ధరలు



హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి : గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం మెట్రో రైలు, ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయంటూ మొట్టికాయలు, ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మెట్రో, ఆర్‌టీసీ కామన్(జాయింట్)పాస్ ధరలు ప్రయాణికులకు షాక్ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. ఇక, రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 - రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది.

ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు,ఆర్‌టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో,ఆర్‌టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తి స్పష్టత రానుంది. ఈ నిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

నేలకు తొలి సంతకం..!!

ధరణి గర్భపు చీకట్లను
ఆశతో చీల్చుకుంటూ,
నవరాగాన్ని పాడుకుంటూ
నింగి వైపు ప్రయాణం..!!
చినుకుల స్నానంతో
కిరణపు వెలుగుల్లో
ఉషస్సు నూతన కాంతిలా
కొత్త చిగుళ్ళు తొడిగింది..!!

చిట్టి అడుగులు వేస్తూ
చిట్టారు కొమ్మల్లో కులుకుతూ
నింగితో మాట్లాడేందుకు
తనువునంతా చాచింది..!!
పలచని పచ్చని ఆకుతో
ఒళ్లంతా చిగురులతో
జీవితం వైపు ఆశతో
వడివడిగా అడుగులేసింది..!!

వెచ్చని కిరణాల కాంతిలో,
ఆశల కాంతులను వెదజల్లుతూ
అవనికి అందాలు పంచుతూ
పసిడి పత్రాలతో శోభిల్లింది..!!.
చక్కని పువ్వులు
చిక్కని నవ్వులతో
మధుర ఫలాల శోభతో
కమ్మని విందులే పంచింది!!.

అతిథులకు ఆహారమై
గృహస్థులా నివసించే
సృష్టికి తోడు నీడగా ఉంటూ
మట్టికి సంపదలా పుట్టింది..!!
ఏ కష్టానికైనా వెరవక
ఎదిగే ధైర్యాన్ని చాటుతూ
నింగి వరకు ప్రయాణం
నేలమ్మకు తోడుగా నిలిచింది..!!

చిన్న మొక్కే కావచ్చు...
కానీ దాని సంకల్పం గొప్పది
రేపటి మహా వృక్షానికి
ఈ మొక్కే తొలి సంకేతం!

- కొప్పుల ప్రసాద్
9885066235

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

పేదరికంపై గణాంకాల గారడీ..



పేదరికం తగ్గిందని గణాంకాలు గర్జిస్తున్నాయి. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పాలకులు డప్పులు కొడుతున్నారు. కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని నివేదికలు ప్రకటిస్తున్నాయి. కానీ నేలమీద సామాన్యుడి బతుకు చూస్తే ఆ గణాంకాల గొప్పదనం ఎక్కడా కనిపించడం లేదు. నిత్యావసరాల ధరలు నిప్పులా మండుతున్నాయి. చదువుల ఖర్చులు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి. ఉద్యోగం దొరికినా కుటుంబాన్ని పోషించలేని వేతనాలు. ఇదేనా పేదరికం నుంచి బయటపడిన భారత్? కాగితాలపై పేదరికం తగ్గినంత మాత్రాన కడుపులో ఆకలి తగ్గుతుందా? నివేదికల్లో ఆదాయం పెరిగినట్లు చూపినంత మాత్రాన ఇంట్లో అప్పులు తీరిపోతాయా? పాలకులు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలివి.

ప్రపంచ బ్యాంకు 2026 అక్టోబరు నివేదిక ప్రకారం రోజుకు మూడు డాలర్ల ఆదాయ ప్రమాణంతో లెక్కించిన అత్యంత పేదరికం 2011లో 27.1 శాతంగా ఉండగా, 2023 నాటికి 2.6 శాతానికి తగ్గింది. మరో ప్రమాణం ప్రకారం పేదరికం 57.7 శాతం నుంచి 16.1 శాతానికి పడిపోయింది. సుమారు 49.6 కోట్ల మంది పేదరిక స్థాయిని దాటినట్లు అంచనా. ఇవి దేశానికి సానుకూల పరిణామాలే. కానీ రోజుకు 8.30 డాలర్ల ఆదాయ ప్రమాణాన్ని తీసుకుంటే భారత్లో దాదాపు 80 శాతం మంది ఇప్పటికీ ఆ స్థాయికి దిగువనే ఉన్నారు. అంటే పేదరికం తగ్గిందన్న ప్రకటన వెనుక ఆర్థిక అస్థిరత అనే చేదు వాస్తవం దాగి ఉంది. పేదరిక రేఖను కొద్దిగా దాటిన వ్యక్తి సంపన్నుడైపోడు. అప్పుల ఊబి నుంచి బయటపడని కుటుంబం ఆర్థికంగా భద్రత సాధించినట్లు కాదు.

దేశ అభివృద్ధిని కొలవడానికి కేవలం పేదరిక శాతాలను చూపించడం పాలకులకు సులభమైన మార్గం. కానీ ఒక పేద కుటుంబం నెలాఖరుకు ఎంత మిగుల్చుకుంటోంది? ఎంత అప్పు చేస్తోంది? పిల్లల చదువుకు ఎంత ఖర్చు పెడుతోంది? అనారోగ్యం వస్తే వైద్యం చేయించుకునే స్థోమత ఉందా? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ఉచిత బియ్యం అందిస్తే ఆకలి సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లేనా? సంక్షేమ పథకం కింద కొంత నగదు జమ చేస్తే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకున్నట్లేనా? ప్రజలను నిరంతరం ప్రభుత్వ సహాయంపై ఆధారపడే పరిస్థితిలో ఉంచడం అభివృద్ధి కాదు. వారి కాళ్లపై వారు నిలబడేలా ఉపాధి, ఆదాయం, ఆర్థిక అవకాశాలు కల్పించడమే నిజమైన పాలన.

2017 నుంచి 2023 మధ్య దేశంలో ఉపాధి పొందిన వారి సంఖ్య సుమారు 13.4 కోట్ల మేర పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఉపాధి పెరిగిందని చెప్పుకోవడం బాగానే ఉంది. కానీ ఆ ఉపాధి ద్వారా కుటుంబం గౌరవంగా బతుకుతోందా? అన్నదే అసలు ప్రశ్న. రోజంతా కష్టపడినా నెలాఖరుకు చేతిలో చిల్లిగవ్వ మిగలని కార్మికులు లక్షల్లో ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగాలు, తాత్కాలిక పనులు, తక్కువ వేతనాలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. చదువులు పూర్తిచేసిన యువత ఉద్యోగాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, ఉపాధి పెరిగిందన్న ప్రకటనలు వారి నిరాశను తొలగించలేవు. పని కల్పించామని చెప్పడం కాదు.. ఆ పనికి గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి. దేశంలో సంపద సృష్టి జరుగుతోంది. పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. పెట్టుబడులు పెరుగుతున్నాయి. కానీ ఆ సంపద ఫలాలు ఎవరికి అందుతున్నాయి? సంపన్నుల సంపద కొండలా పెరుగుతుంటే మధ్యతరగతి కుటుంబాలు అప్పుల భారంతో కుంగిపోతున్నాయి.

పేద కుటుంబాలు కనీస అవసరాల కోసం పోరాడుతున్నాయి. ఆదాయ అసమానతలు పెరుగుతున్న పరిస్థితిలో దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. అభివృద్ధి అంటే కొద్దిమంది చేతుల్లో సంపద పేరుకుపోవడం కాదు. కష్టపడే ప్రతి చేతికి తగిన ప్రతిఫలం దక్కడం. పేదవాడి పిల్లలకు కూడా నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉండటం. సామాన్యుడి ఇంట్లో ఆర్థిక భద్రత ఉండటం.

పేదరికం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. రైతుకు పంట పెట్టుబడి భారంగా మారుతోంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా పని ఉండటం లేదు. గ్రామీణ యువత ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్తున్నారు. మహిళలు కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నా వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం లభించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పేదరికం తగ్గిందని ప్రకటించడం సమస్యను పరిష్కరించినట్లు కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయకుండా దేశం సమగ్ర అభివృద్ధి సాధించలేదు.

ఒక కుటుంబం పేదరికం నుంచి బయటపడటం ఎంత కష్టమో, తిరిగి పేదరికంలోకి జారిపోవడం అంతకంటే సులభం. కుటుంబంలో ఒక్కరికి అనారోగ్యం వచ్చినా, ఉద్యోగం పోయినా, ప్రకృతి వైపరీత్యం సంభవించినా ఆర్థిక పరిస్థితి తలకిందులవుతుంది. అప్పులు పెరిగి కుటుంబం మళ్లీ పేదరికంలోకి చేరుతుంది.

అందుకే ప్రభుత్వాలు కేవలం పేదరిక నిర్మూలన గణాంకాలకే పరిమితం కాకుండా ప్రజలకు శాశ్వత ఆర్థిక భద్రత కల్పించాలి. నాణ్యమైన విద్య, అందుబాటు వైద్యం, స్థిరమైన ఉపాధి, సామాజిక భద్రత, పొదుపు అవకాశాలు కల్పించాలి. పేదరికం నుంచి బయటపడిన కుటుంబాలు తిరిగి వెనక్కి వెళ్లకుండా రక్షణ వ్యవస్థను నిర్మించాలి.

దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పుకోవడానికి గణాంకాలు ఉపయోగపడవచ్చు. కానీ ప్రజల ఆకలి, నిరుద్యోగం, అప్పులు, అసమానతలను కప్పిపుచ్చడానికి అవే తెరలుగా మారకూడదు. పేదరికం తగ్గిందని ప్రకటించే ముందు పేదవాడి ఇంట్లోకి వెళ్లి అతని కష్టాలను చూడాలి. పాలకుల ప్రసంగాల్లో అభివృద్ధి కనిపించడం కాదు.. ప్రజల జీవితాల్లో అది ప్రతిబింబించాలి. పేదవాడికి ఉచిత పథకం అందించడం కంటే తన కష్టంతో సంపాదించి గౌరవంగా బతికే అవకాశం కల్పించడం గొప్ప పాలన.

పేదరికాన్ని గణాంకాల్లో ఓడించి, ప్రజల జీవితాల్లో ఓడిపోతే ఆ విజయానికి అర్థం లేదు. పేదరికం తగ్గిందని డప్పులు కొట్టడం మానండి.. పేదవాడి బతుకులో భరోసా నింపండి! ఆకలి లేని ఇల్లు, అప్పులేని కుటుంబం, నిరు ద్యోగం లేని యువత, భద్రతతో కూడిన భవిష్యత్తు నిర్మించి నప్పుడే భారత్ నిజమైన అభివృద్ధి చెందిన దేశంగా నిలుస్తుంది.

- వెంక గారి భూమయ్య
9848559863

'ట్రంప'రితనానికి డెమొక్రట్ల చెక్



అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కు మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. రాజకీయాల్లో ఎప్పుడూ తనదైన దూకుడుతో, తన నిర్ణయాలే దేశానికి దిక్సూచి అన్నట్లుగా వ్యవహరించే ఆయనకు తాజాగా జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితాలు గట్టి గుణపాఠాన్ని నేర్పాయి. సెనేట్, ప్రతినిధుల సభ రెండింటిలోనూ రిపబ్లికన్ పార్టీ మెజారిటీ కోల్పోవడం సాధారణ ఓటమి కాదు. రెండేళ్ల ట్రంప్ పాలనపై అమెరికా ఓటర్లు వ్యక్తం చేసిన అసంతృప్తికి ఇది నిదర్శనం. ఎన్నికల ఫలితాలను ట్రంప్ విధానాలకు ప్రజలు ఇచ్చిన తిరస్కారంగా భావించవచ్చు .

ట్రంప్ ఎన్నికల ప్రచారంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తానని, ధరలు తగ్గిస్తానని, ఉద్యోగావకాశాలు పెంచుతానని హామీ ఇచ్చారు. కానీ ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయాలు సామాన్య కుటుంబాలపై పెను భారాన్ని మోపాయి. ఆదాయం పెరుగుదలకు అనుగుణంగా, జీవన వ్యయం తగ్గకపోవడం ప్రజల్లో అసహనాన్ని పెంచింది. ఓటర్లలో అధిక శాతం దేశఆర్థిక పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితి రెండేళ్ల కిందటితో పోలిస్తే దిగజారిందని భావించినవారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. ఆర్థికవ్యవస్థపై ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులకు మధ్య ఏర్పడిన అంత రమే ఎన్నికల్లో ప్రతిఫలించింది.



అమెరికా ప్రయోజనాల పేరుతో ఇతర దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధించడం ట్రంప్ ఆర్థిక విధానాల్లో కీలకమైనది. చైనా సహా పలు దేశాలతో వాణిజ్య ఘర్షణలకు దిగడం ద్వారా అమెరికా ఉత్పత్తులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆయన భావించారు. అయితే దిగుమతులపై సుంకాల భారం చివరకు వినియోగదారుల ధరలపై పడే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం, వ్యాపార అనిశ్చితి పెరగడం కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేశాయి. దేశీయ పరిశ్రమలను కాపాడాలనే లక్ష్యం ఒకవైపు ఉంటే, సామాన్య వినియోగదారుల కొనుగోలు శక్తిని కాపాడటం మరోవైపు ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమవడం ఓటర్ల అసంతృప్తికి కారణమయ్యింది. ఇరాన్‌తో యుద్ధం తదనంతర పరిణామాలు, మధ్యప్రాచ్యంలో పెరిగిన ఉద్రిక్తతలు, అమెరికా ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయి. ప్రపంచ శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కంటే అమెరికా ఆధిప త్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు కూడా వినిపించాయి. యుద్ధం ఇంధన ధరలను ప్రభా వితం చేయడం వల్ల విదేశాంగ విధానాల ప్రభావం నేరుగా అమెరికా కుటుంబాల ఆర్థిక జీవితంలోకి ప్రవేశించింది. ఎన్నికల్లో ఆర్థిక అంశాలతోపాటు ఇరాన్ యుద్ధం కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభా వితం చేసిందని ఫలితాల సరళిని చూస్తే తెలుస్తు న్నది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల గెలుపోటములను కూడా ట్రంప్ తన వ్యక్తిగత ప్రతిష్ఠతో ముడిపెట్టు కున్నారు. ప్రచార చివరిదశలో అనేకరాష్ట్రాల్లో పర్యటిస్తూ తన పేరుతోనే ఓటేయాలని మద్దతు దారు లను కోరారు. అయినప్పటికీ ఆయన మద్దతు అభ్యర్థులకు విజయాన్ని అందించలేక పోయింది. ముఖ్యంగా యువతలో డెమోక్రటిక్ పార్టీకి మద్దతు పెరిగినట్లు ఎన్నికల విశ్లేషణలు వెల్లడించాయి. ఇది ట్రంప్‌కు ఉన్న వ్యక్తిగత రాజకీయ ఆకర్షణకు పరిమితులున్నాయని సూచిస్తోంది.

రెండు సభల్లోనూ డెమోక్రాట్లు ఆధిక్యం సాధించడంతో ట్రంప్‌ప్రభుత్వానికి మిగిలిన రెండేళ్లు రాజకీయంగా అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ బిల్లులు, బడ్జెట్ కేటాయింపులు, కీలక నియామకాలు, విదేశాంగ విధానాలకు సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ నుంచి ప్రతిఘటన ఎదురుకావచ్చు. చైనా, రష్యా, యూరప్, భారత్‌తోఅమెరికా సంబంధాలపై కూడా ఈ పరిణామాల ప్రభావం ఉండవచ్చు. అమెరికా విధానాల్లో నిరంతర మార్పులుంటాయనే అనిశ్చితి ఇతర దేశాల వ్యూహాత్మక నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు. అయితే మధ్యంతర ఎన్నికల ఫలితాలను ట్రంప్ అధ్యక్ష పదవికి నేరుగా ప్రజాభిప్రాయ సేకరణగా భావించలేం. స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం కూడా ఫలితాలను నిర్ణయిస్తాయి. అయినప్పటికీ రెండు సభల నియంత్రణను కోల్పోవడం ఆయన పాలనకు ఎదురైన స్పష్టమైన రాజకీయ ఎదురుదెబ్బ.

ప్రజాస్వామ్యంలో ప్రజల మద్దతు శాశ్వత ఆస్తి కాదు. ఎన్నికల విజయంతో అధికారంలోకి రావచ్చు. కానీ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల ద్వారా మాత్రమే ఆ అధికారాన్ని నిలబెట్టుకోగలరు. ప్రపంచానికి నాయకత్వం వహించాలని ఆశించే అమెరికా అధ్యక్షుడు ముందుగా తన దేశ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి. లేకపోతే ఆ ఆధిపత్య రాజకీయాలు, ఇంటా బయటా చెల్లుబాటు కాకుండా పోతాయి. ఇదే ఈ మధ్యంతర ఎన్నికల ఫలితాలు ఇచ్చే సందేశం.

- గుండెబోయిన శ్రీనివాస్

రాష్ట్రం ఏర్పడి పుష్కరం దాటినా...



బీసీ సమాజం జీవితాల్లో ఆశించిన స్థాయిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు కనిపించడం లేదు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీలు నేటికీ అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి రంగాల్లో సమాన అవకాశాలు అందకపోవడం సామాజిక న్యాయానికి సవాలుగా మారింది. తెలంగాణలో బీసీ కులగణన జరగడం బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన పరిణామం. అయితే కులగణన ద్వారా సేకరించిన వివరాలు కేవలం నివేదికలకే పరిమితం కాకూడదు. జనాభా ప్రాతిపదికన హక్కుల గురించి మాట్లాడుతున్న బీసీ సమాజానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. ఈ విషయంలో శాసన పరమైన, న్యాయపరమైన అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. శాసనసభ, పార్లమెంటు, శాసనమండలి, స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంపై స్పష్టమైన విధానం ప్రకటించాలి.

మరోవైపు బీసీ విద్యార్థుల భవిష్యత్తు కూడా ఆందోళనకరంగా మారుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్ల చెల్లింపులో జాప్యం కారణంగా పేద బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు గురుకుల పాఠశాలలు, కళాశాల హాస్టళ్లు, పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలను విస్తరించాలి.

రాజకీయంగా చూస్తే బీసీలకు ఎదురవుతున్న మరో ప్రధాన సమస్య అధికారం, నిర్ణయాధికారంలో తగిన భాగస్వామ్యం లేకపోవడం. అన్ని రాజకీయ పార్టీలు బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడుతున్నప్పటికీ, కీలక పదవుల పంపకంలో బీసీలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాయనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. పార్టీ పదవుల నుంచి ప్రభుత్వ నామినేటెడ్ పదవుల వరకు, మంత్రివర్గం నుంచి చట్టసభల వరకు బీసీలకు సముచిత స్థానం కల్పించాలి. బీసీలకు కేవలం ప్రచార బాధ్యతలు అప్పగించి, అధికారం పంచుకునే సమయంలో పక్కన పెట్టే రాజకీయ సంస్కృతికి ముగింపు పలకాలి. బీసీ సమాజంలో వందలాది కులాలు, ఉపకులాలు ఉన్నప్పటికీ వారి సమస్యల మూలం సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనమే. అందువల్ల కులాల మధ్య అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా చేరేలా చూడాలి. బీసీల్లో ఐక్యత బలపడినప్పుడే వారి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి బలంగా చేరుతాయి.

ఇకనైనా పాలకులు బీసీల సమస్యలను ఎన్నికల హామీలుగా కాకుండా పరిష్కరించాల్సిన సామాజిక బాధ్యతగా గుర్తించాలి. కులగణన గణాంకాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వావలంబన రంగాల్లో బీసీలకు న్యాయం జరిగేలా కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలి. బీసీ యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించాలి. కులవృత్తిదారులకు జీవన భద్రత కల్పించాలి. పేద బీసీ కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించాలి.రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమాన అవకాశాలు, జనాభాకు తగిన ప్రాతినిధ్యం కావాలి. తరతరాలుగా శ్రమిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములైన బీసీలు ఇంకా ఎంతకాలం తమ హక్కుల కోసం ఎదురుచూడాలి?

ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలతోనే బీసీల జీవితాలు మారవు. ఆ హామీలు ఆచరణలోకి వచ్చినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్

తొలి మహిళా ఎయిర్ మార్షల్ పద్మావతి



పద్మావతి బందోపాధ్యాయ (జననం. నవంబరు 4 1944) భారత దేశం లోని మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి. భారతీయ వైమానిక దళంలో తొలి మహిళా ఎయిర్ మార్షల్గా నిలిచి, మహిళలకు ఏదైనా సాధ్యం అన్న దిశగా మార్గం చూపారు. ఆమె సాధన, అంకితభావం, క్రమశిక్షణ ఆమెను ఇతరులకెందరో స్ఫూర్తిగా నిలిపాయి. పద్మావతి చిన్నప్పటి నుండి దేశ సేవ చేయాలనే తపనతో జీవనం సాగించారు. 1944లో పశ్చిమ బెంగాల్లో జన్మించిన ఆమె విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. 1962లో చైనా-భారత యుద్ధం ఆమె మనసులో జాతీయతా భావాన్ని మరింతగా పెంపొందించింది. ఈ సంఘటన ఆమెను తీవ్రంగా ప్రభావితం చేసి, భారత వైమానిక దళంలో చేరాలని ప్రేరణ నిచ్చింది. వైద్యంలో బోధన పొందిన తర్వాత ఆమె వైమానిక దళంలో ప్రవేశించారు.

పద్మావతి బందోపాధ్యాయ కెరీర్‌లో అనేక కీలక ఘట్టాలను అధిగమించారు. ఆమె ప్రతిభతో మహిళలందరికీ నిదర్శనంగా నిలిచారు.1978లో డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో కోర్సును పూర్తి చేసిన మొదటి మహిళా అధికారి అనేది ఆమె సాధించిన అద్భుత విజ యాలలో ఒకటి.వైమానిక దళంలో ఏవియేషన్ మెడిసన్లో ఆమె నైపుణ్యాలు, ప్రతిభ మరింత మెరుగు పరిచాయి. విమాన పైలట్ల ఆరోగ్యం, భద్రత, మరియు సామర్థ్యాలను మెరుగుపరచడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. భారత వైమానిక దళ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ మెడికల్ సర్వీసెస్‌గా సేవలందించడం ద్వారా అధిక హోదాలోని బాధ్య తలను విజయవంతంగా నిర్వహించారు. 2002లో, ఎయిర్ వైస్ మార్షల్ హోదా పొందిన మొదటి మహిళగా చరిత్రలో నిలిచారు. వైమానిక రంగంలో మహిళలకు కొత్త నాయికగా మారారు.

పద్మావతి తన సేవలకు అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. భారత దేశం తరపున దక్షిణ ధ్రువం వంటి సాహస ప్రదేశాలలో పరిశోధనలు చేసిన మొదటి మహిళగా నిలవడం గర్వకారణం. ఆమె పరిశోధన ప్రయాణం పఠనశీలత, సాహసాలను సూచిస్తుంది. ఆమె వృత్తి, సేవా దృక్పథం పట్ల కట్టుబాటు భారత వైమానిక దళానికి కీలకంగా మారాయి.పద్మావతి బందోపాధ్యాయ మహిళలందరికీ ఒక స్ఫూర్తి వంతురాలు. ఆమె చూపిన ధైర్యం, కష్టపడి పనిచేసే తీరు, అంకితభావం ఆధునిక మహిళా సాధికారతకు చిహ్నం. పాఠశాల విద్యార్థులు, యువతీయువకులు ఆమెను ఆదర్శంగా తీసుకుంటూ తన రంగాల్లో రాణిస్తున్నారు. ఆమె కృషి మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది - కష్టసాధ్యమైనా ప్రతిభతో, సమర్పణతో, మరియు పట్టుదలతో మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మహిళా సంఘ భవనాలకు రూ.46లక్షలు మంజూరు

- మహిళా సాధికారతకు బాటలు వేస్తున్న మంత్రి
- ఉపాధి హామీ నిధులతో మూడు భవనాల నిర్మాణం
- మంత్రి పొన్నంకు ప్రత్యేక కృతజ్ఞతలు మహిళలు



చిగురుమామిడి, నవంబర్ 5 (మనం న్యూస్): చిగురుమామిడి గ్రామంలోని మహిళా వీఓ సంఘాల బలోపేతానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో రూ.46 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలో నిర్మించ తలపెట్టిన మూడు మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులకు గురువారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి శాస్త్రోక్తంగా ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకవరం భవాని మాట్లాడుతూ గ్రామీణ మహిళల మరియు మహిళా సంఘ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి ఈ సంఘ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చిగురు మామిడి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, మహిళల అభ్యున్నతి కోసం నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు చిగురుమామిడి గ్రామ ప్రజల పక్షాన, అలాగే పాలకవర్గం మహిళా సంఘాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి సహకారంతో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ఈ మూడు భవనాల నిర్మాణాన్ని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. మహిళలు ఒకచోట చేరి తమ సంఘాల అభివృద్ధిపై చర్చించుకోవడానికి, వ్యాపార, ఉపాధి మార్గాలను మెరుగుపరు చుకోవడానికి ఈ భవనాలు ఒక చక్కని వేదికగా మారుతాయ న్నారు.అనంతరం సింగిల్ విండో చైర్మన్ చిట్టమల్ల రవీందర్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు బలోపేతం కావడమే గ్రామాభివృద్ధికి పునాది అని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చిగురుమామిడి గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి మహిళల కోసం రూ.46 లక్షలు మంజూరు చేయించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఈ భవనాల వల్ల మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, శిక్షణలు పొందడానికి, స్వయం ఉపాధి వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడు తుందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు మంత్రి చేస్తున్న కృషికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ భూమి పూజ, ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాశబోయిన విజయ లక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, పీఆర్ ఏఈ నిరంజన్ రెడ్డి, ట్రాన్స్కో ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, మహిళా సమాఖ్య మండల ఏపీఎం రజిత, వార్డు సభ్యులు పన్యాల అన్నపూర్ణ, పోతర్ల శివాంజనేయులు, పోతరవేణి అనిల్, దున్నపోతుల సౌందర్య, కనుమల్ల లావణ్య, వేల్పుల భాగ్య, చెరుకు సమ్మయ్యతోపాటు ఐకేపీ సీసీలు, సీఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల లచ్చిరెడ్డి, జిల్లెల్ల రమేష్, కవ్వంపల్లి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో ఎన్నికలలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



జగిత్యాల, నవంబర్ 05 (మనం ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం యువతలో ఎన్నికల అవగాహనను పెంపొందించేందుకు చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో భాగంగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూయువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ల (ఎన్నికల అక్షరాస్యత క్లబ్లు) ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు.ఈ పోటీలను మూడు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. అనంతరం నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.విద్యార్థుల్లో ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ల ద్వారా ఈ పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.యువతలో ఎన్నికల అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని, ఎన్నికల ప్రక్రియలో చైతన్యవంతమైన యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ, హిస్టరీ షీటర్లపై పోలీసుల నిఘా

- జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు..
- నేరాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్
- జిల్లా ఎస్పీ మహేష్ బి, గితే



సిరిసిల్ల, నవంబర్ 05 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటర్ల ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, వారి ప్రస్తుత కార్యకలాపాలు, జీవన విధానంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బైండోవర్ చర్యలు తీసుకుంటామని, సత్ప్రవర్తనతో జీవిస్తున్న అర్హుల విషయంలో నిబంధనల ప్రకారం షీట్ల తొలగింపునకు చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని స్పష్టం చేశారు.

అధికారులు స్పందించారు..

- మూలమలుపు వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు
- 'మనం' దినపత్రిక కథనానికి స్పందన...



రామడుగు, నవంబర్ 5 (మనం న్యూస్): రామడుగు మండలం వెదిరే ఎక్స్ రోడ్డు నుండి గోపాలరావుపేట, పెగడపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే రహదారి మూలమలుపు వద్ద కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న తీరుపై ఈనెల 3న 'మనం' తెలుగు దినపత్రికలో 'రహదారిపై రక్షణ చర్యలు కరువు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు. మూలమలుపు వద్ద ఉన్న పిచ్చి మొక్కలను, ముండ్ల పొదలను గురువారం బ్లేడు ట్రాక్టర్ తో చదును చేయించారు. వాహనదారుల సమస్యను తమ పత్రిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'మనం' తెలుగు దినపత్రిక ప్రతినిధిని ఈ సందర్భంగా పలువురు వాహనదారులు అభినందించారు.


అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్



మంథని నవంబర్5(మనం న్యూస్): మంథని పట్టణంలోని రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్,పాలకవర్గ సభ్యులు మారుపాక నిహారిక-నాగరాజు,లైశెట్టి రజిత-రాజు,ఎల్లెంకి వంశీధర్ లతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని తెలిపారు.రేషన్ కార్డుల మంజూరు పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు.రేషన్ కార్డుల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రిదుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.గతంలో పేద ప్రజలకు సన్నబియ్యం అందుబాటులో ఉండేది కాదని,ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన ఆహారం అందించే కార్యక్రమం అమలవుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జంభోజు సమ్మయ్య,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పాల్గొననున్న ఎన్సీసి క్యాడేట్లు



హన్మకొండ, నవంబర్ 5(మనంన్యూస్): ఎన్సీసి వరంగల్ గ్రూప్ హెడ్ క్వాటర్లలో గ్రూప్ కమాండర్ కర్నల్ రాజేష్ నాయర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి 2027 జనవరి 26న న్యూఢిల్లీ రిపబ్లిక్ డే పర్యటలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్సీసీ డైరెక్టర్ ఆధ్వర్యంలో (ఇంటర్ గ్రూప్) అంతర్ గ్రూపుల రిపబ్లిక్ డే పాల్గొనే ఎన్సిసి క్యాడేట్ల ఎంపిక కాంపిటీషన్లో వరంగల్ గ్రూప్ మొదటి స్థానం అన్ని విభాగాల్లో సాధించిందని గ్రూప్ కమాండర్ కర్నల్ రాజేష్ తెలిపారు. మొదటి స్థానం సాధించిన సందర్భంగా గ్రూప్ ప్రధాన కార్యాలయంలో క్యాడెడ్స్ ను అభినందించారు కఠోరమైన శిక్షణ వివిధ గ్రూప్ బెటాలియన్ లోని అధికారుల సమన్వయంతో క్రమశిక్షణతో ఈ అరుదైన విజయాన్ని సాధించామని భవిష్యత్ ఆర్మీ యువ నాయకత్వం ఇందులోనుండే తయారవుతుందని గ్రూప్ కమాండర్ వారి ప్రదర్శనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ కర్నల్ రాహుల్ సింగ్, కర్నల్ ఎస్ఎస్ రామదురై,లెఫ్టెంట్ కార్నల్ రవి సునారే, 4వ ఎయిర్ వింగ్ బెటాలియన్ ఏవో వినోద్, కర్నల్ వినయ్, కర్నల్ సంతోష్ మెహర్, కర్నల్ భద్రం, గ్రూప్ హెడ్ కోటర్ ఏ ఒ వై కవిత సూపరిండెంట్ పుష్పీ బై రెండు ఉమ్మడి జిల్లాల క్యాడేట్స్ ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు వీరు మళ్లీ హైదరాబాదులో శిక్షణ పొంది డిసెంబర్లో న్యూఢిల్లీ వెళ్లి జనవరి 26 గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎంపికైన కాడేట్స్ గణతంత్ర వేడుకల్లో ఢిల్లీలో పాల్గొంటారని సంతోషంతో గ్రూప్ కమాండర్ తెలిపారు వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బెటాలియన్ల అధికారులు ఛిఛి శిక్షణ సిబ్బంది గ్రూప్ హెడ్ కోటర్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞానం సమాజ మార్పునకు సాధనం కావాలి



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యశ్వంత్ సింగ్....

రామడుగు నవంబర్ 5(మనం న్యూస్): న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం న్యాయవాద వృత్తికి పరిమితం కాకుండా, సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందించే సామాజిక బాధ్యతను కూడా స్వీకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ అన్నారు. న్యాయ విజ్ఞానాన్ని ప్రజల హక్కుల పరిరక్షణకు, సమాజంలో సమానత్వం, న్యాయ స్థాపనకు వినియోగించాలని పిలుపునిచ్చారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం (నవంబర్ 9) సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కిమ్స్ లా కాలేజ్ విద్యార్థులకు గురువారం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ అనుమతితో, కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వపు హక్కును, ఆర్టికల్ 39-అ సమాన అవకాశాలతో న్యాయం అందించేందుకు ఉచిత న్యాయ సహాయాన్ని నిర్దేశిస్తున్నాయని వివరించారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థల చట్టం - 1987 ద్వారా అర్హులైన పౌరులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, కోర్టుల్లో న్యాయవాది సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నల్సా, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థల విధులు, లోక్ అదాలత్లు, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారంపై వివరించారు. న్యాయ విద్యార్థులు.. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల హక్కులపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, పోక్సో నేరాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, వినియోగదారుల సమస్యలు వంటి అంశాల్లో బాధితులకు సరైన న్యాయ మార్గదర్శకత్వం అందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. న్యాయవాద వృత్తి కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల హక్కులను కాపాడే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. బాధితుల సమస్యలను ఓపికగా వినడం, వారి గోప్యతను కాపాడటం, వివక్షకు తావులేకుండా న్యాయ సహాయం అందించడం, చట్టాలను సామాన్యులకు అర్థమయ్యే భాషలో వివరించడం ప్రతి న్యాయ విద్యార్థి అలవర్చుకోవాలని సూచించారు. న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలనే రాజ్యాంగ ఆశయ సాధనలో న్యాయ విద్యార్థులు భాగస్వాములు కావాలని, న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేసే సామాజిక న్యాయ దూతలుగా ఎదగాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ కోరారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ పేర్యాల సాకేత్ రామారావు, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నవీన్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, ఏ.కిరణ్ కుమార్, సిహెచ్. చంద్రప్రకాష్ రెడ్డి, అధ్యాపకులు, కొమురయ్య, వెంకటస్వామి, కిషన్, వంశీ కృష్ణ,కీర్తి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు

- ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిరంతర పర్యవేక్షణ



కరీంనగర్ నవంబర్ 5(మనం బ్యూరో): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో ఉన్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు), వీవీప్యాట్ గోదామును గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, సంబంధిత వివరాలతో కూడిన నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం గోదాములోని ఈవీఎం, వీవీప్యాట్ భద్రపరిచిన గదులను పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న భద్రతా చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని పోలీస్ గార్డులకు సూచించారు. అలాగే గోదాము పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పడిశెట్టి భూమయ్య, టీడీపీ పార్టీ ప్రతినిధి ఎర్రబెల్లి రవీందర్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ అలీ, కరీంనగర్ తాసిల్దార్ ఎం రాజేష్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు



గోవిందరావుపేట, నవంబర్ 5,మనం ప్రతినిధి: అర్హులైన పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తోందని ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ అన్నారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు గురువారం గోవిందరావుపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వారు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డుల జారీ జరగలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందజేస్తోందని తెలిపారు.

రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి జోగా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, తహసీల్దార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాలడుగుల వెంకటకృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాల నాగమణి, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



జగిత్యాల, నవంబర్ 05(మనం న్యూస్): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మెంగు లక్ష్మీ రాజన్నకు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేసి, నూతన గృహాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,ఉప సర్పంచ్ సత్తిరెడ్డి,ధర్మారం సర్పంచ్ మల్లేష్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, నాయకులు పురిపాటి రాజిరెడ్డి,మాజీ ఎంపీటీసీ గిద్ది శంకర్, నల్ల స్వామి రెడ్డి, దనేశ్వర్ రావు,సత్తవ్వ వార్డు సభ్యులు లత మల్లేష్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల, నవంబర్ 5 (మనం ప్రతినిధి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కూలీల సంఖ్య పెంచి, ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేఎస్వీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

- భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 5 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం గౌతంపల్లి గ్రామంలో కొనసాగుతున్న నీటిపారుదల కాల్వలకు సంబంధించిన భూ రీ సర్వే ప్రక్రియను గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో భూ రీ సర్వే పనుల పురోగతి, భూముల వివరాల నమోదు, రైతులకు సంబంధించిన భూ రికార్డుల స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వే ప్రక్రియలో భాగంగా రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములు, రైతుల నుంచి స్వీకరించిన నీటిపారుదల భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటూ, సర్వే ప్రక్రియ ఏ మేరకు పూర్తయింది, ఇంకా ఎన్ని భూముల వివరాలను నమోదు చేయాల్సి ఉంది అనే అంశాలపై ఆరా తీశారు. రైతులకు సంబంధించిన భూముల విస్తీర్ణం, భూముల సరిహద్దులు, భూ రికార్డుల్లో నమోదైన వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూముల పరిస్థితిని పరిశీలించారు. భూ రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వాస్తవ వివరాలను గుర్తించి, రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. రైతుల భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణం, సర్వేలో గుర్తించిన భూముల వివరాలను సమన్వయం చేసుకోవాలని, గ్రామంలో రైతులకు సంబంధించిన భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ యాజమాన్యానికి సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. భూ రీ సర్వే సమయంలో రైతులకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండేలా చూడాలని, భూముల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలపై రైతులకు ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిని పరిశీలించారు. సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను రైతుల భూముల వివరాలతో సమన్వయం చేసుకుంటూ సర్వే నిర్వహించాలని, భూముల వర్గీకరణలో స్పష్టత ఉండేలా చూడాలని తెలిపారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సక్రమంగా నమోదు కావడం ద్వారా భవిష్యత్తులో భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. రైతుల నుంచి స్వీకరించిన నీటిపారుదల భూముల వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా భూముల విస్తీర్ణం, సర్వేలో నమోదు చేసిన వివరాలు, భూములకు సంబంధించిన రికార్డుల స్థితిగతులను పరిశీలించారు. నీటిపారుదల భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఉన్న సమాచారంతో సరిపోల్చుకోవాలని అధికారులకు సూచించారు.

భూ రీ సర్వే ప్రక్రియలో భూములకు సంబంధించిన ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన భూముల వివరాలు, రికార్డుల్లో నమోదైన వివరాల మధ్య సమన్వయం ఉండేలా చూడాలని తెలిపారు.

రైతుల భూములకు సంబంధించిన వివరాలను నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ప్రభుత్వ భూముల వివరాలను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, భూములకు సంబంధించిన వివరాలను సమగ్రంగా నమోదు చేయడం ద్వారా భూ రికార్డుల నిర్వహణలో స్పష్టత, కచ్చితత్వం సాధించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎమ్మార్వో, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తయితే కరువులోనూ సాగునీరు అందించవచ్చు



- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ, నవంబర్ 5 (మనం ప్రతినిధి): ఎస్ ఎల్ బి సి సొరంగ మార్గం పూర్తయితే ఎంత కరువు వచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుండి నీటిని తీసుకొని రైతులకు సాగునీరు అందించవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణస్వీకారానంతరం మంత్రి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు అత్యంత కీలకమైనవని, రైతులకు సేవ చేసే అవకాశం వీటి ద్వారా లభిస్తుందని అన్నారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్గొండ మార్కెట్ కు సంబంధించి రెండవ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. ఎస్ఎల్బీసీ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా జిల్లా అంతటికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2000 కోట్ల రూపాయలతో చేపట్టిన ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోగా, ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను తిరిగి చేపట్టామని తెలిపారు. ఇటీవలే పనులు ప్రారంభించి చురుకుగా కొనసాగుతున్నాయని చెప్పారు. బ్రాహ్మణ వెల్లేములను కూడా తమ హయాంలోనే చేపట్టడం జరిగిందని, ఇప్పటివరకు 35,000 ఎకరాలకు సాగునీరు అందించగా, లక్ష ఎకరాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఏఎంఆర్పి కాలువల లైనింగును 450 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని, ముశంపల్లి సబ్ స్టేషన్ మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి తదితరులు హాజరయ్యారు. నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ గా బి. హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ గా వి. శ్రీనివాస్ గౌడ్ తో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

సేవా రంగంలో విశేష కృషి



- మారమోని శ్రీశైలం యాదవ్‌కు యూత్ ఐకాన్ అవార్డు

హైదరాబాద్, నవంబర్ 5(మనంన్యూస్): సమాజ సేవే లక్ష్యంగా, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మారమోని శ్రీశైలం యాదవ్కు ప్రతిష్ఠాత్మకమైన 'యూత్ ఐకాన్ అవార్డు-2026' లభించింది. హైదరాబాద్లోని రవీంద్ర భారతి మినీ హాల్లో నిర్వహించిన 'స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం' కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్-ఎన్జీవో జాతీయ అధ్యక్షుడిగా శ్రీశైలం యాదవ్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రక్తదానం, అన్నదానం, పేద విద్యార్థులకు విద్యా సహాయం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రోగులకు వైద్య సహాయం అందిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు. అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడమే నిజమైన సేవ అనే సంకల్పంతో ఆయన ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా, జూబ్లీహిల్స్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఎన్నికైన ఉపాధ్యక్షుడిగా, యాదవ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. యువతలో సేవాభావాన్ని పెంపొందిస్తూ సామాజిక కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలుస్తానని శ్రీశైలం యాదవ్ తెలిపారు. పదవులు, పురస్కారాల కంటే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవడమే నిజమైన విజయం. సేవా మార్గంలో నిరంతరం ముందుకు సాగుతాను అనే సందేశంతో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది

భూమి రికార్డులు పునరుద్ధరించాలి.. భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి

కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులే లక్ష్మణ్ గౌడ్ మృతికి కారణం – బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ

పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం



జనగామ, నవంబర్ 5: (మనం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గురువారం జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ప్రేమలతా రెడ్డి, జామున, బచ్చన్నపేట మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సతీష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన లక్ష్మణ్ గౌడ్ మరణం ఉద్యమకారులకు తీరని లోటని అన్నారు. ఆయనకు చెందిన జేసీబీని సీజ్ చేయడంతో పాటు భారీ పెనాల్టీలు విధించడం, తాతల కాలం నుంచి సాగులో ఉన్న 7.5 ఎకరాల భూమికి సంబంధించిన ధరణి రికార్డులు తొలగించడం వంటి పరిణామాలు ఆయనను తీవ్ర మానసిక ఆవేదనకు గురిచేశాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.లక్ష్మణ్ గౌడ్ భార్య బి.ఫార్మసీ చదివిన విద్యావంతురాలని, ఆమెకు వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. తొలగించిన 7.5 ఎకరాల భూమి రికార్డులను వెంటనే పునరుద్ధరించాలని, బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇప్పటికే బాధిత కుటుంబాన్ని పరామర్శించారని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి ఆదుకుందని గుర్తుచేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జామున మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ మరణాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఆయన మరణానికి సంబంధించి వ్యక్తిగత, వ్యవసాయ సమస్యలు, వనరుల కొరత, వర్షాభావ పరిస్థితులు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై దొంగ ఓట్ల ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల నిబంధనల ప్రకారమే జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వకుండా ఆర్థికంగా బలవంతులకే పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఆ కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజా పోరాట యోధుడు నల్ల నర్సింహులు సేవలు చిరస్మరణీయం



జనగామ నవంబర్ 5 (మనం ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజా హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన నల్ల నర్సింహులు సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఆశయాలు, పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో మన ఆలోచన సాధన సమితి (అఖిఖి) ఆధ్వర్యంలో నల్ల నర్సింహులు 33వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నరసింగరావు పర్యవేక్షణలో, జనగామ కన్వీనర్ పిట్టల సత్యం సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంగళంపల్లి రాజు అధ్యక్షత వహించారు. తొలుత నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగళంపల్లి రాజు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం నల్ల నర్సింహులు సాగించిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జీవిత చరిత్రను, పోరాట ప్రస్థానాన్ని భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎలగందుల కృష్ణ, గుర్రం నాగరాజు, ఏల హరినాథ్, జి. కృష్ణ, సోమ నరసింహాచారి, ఆసర్ల సుభాష్, తుంగ కౌశిక్, సాయన్న, సోమన్న, దిగోజు, కొలిపాక నర్సింహులు, కీర్తి వీరేందర్, బిట్ల శంకర్, జెర్రిపోతుల అబ్బయ్య, సాంబాచారి తదితరులు పాల్గొన్నారు. వివిధ కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కవులు, కళాకారులు హాజరై నల్ల నర్సింహులుకు ఘన నివాళులర్పించారు.

పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్టు రూ.57.50 కోట్లు

- పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్టు రూ.57.50 కోట్లు
- జోగులాంబ ఆలయ అభివృద్ధి, మున్సిపాలిటీ ఆధునికీకరణకు మహత్తర ప్రణాళిక
- అలంపూర్‌ను అంతర్జాతీయ స్థాయి వారసత్వ, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్, నవంబర్ 5 (మనం బ్యూరో): అలంపూర్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన రూ.57.50 కోట్ల అలంపూర్ వారసత్వ, పర్యాటక అదేవిదంగా పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ఆమోదం లభించడం జిల్లాకు గర్వకారణమని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం పొందిన తెలంగాణ రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగర అభివృద్ధి ప్రాజెక్టుల్లో అలంపూర్ ఇంటిగ్రేటెడ్ హెరిటేజ్, టూరిజం అండ్ అర్బన్ రీజనరేషన్ ప్రాజెక్టుకు స్థానం లభించడం జోగులాంబ గద్వాల జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ తెలిపారు .మొత్తం రూ.57.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.14.38 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.14.38 కోట్లు, మిగిలిన 50 శాతం వాటాగా రూ.28.75 కోట్లను మార్కెట్ ఫైనాన్స్ వరల్ బ్యాంక్ ద్వారా సమకూర్చనున్నట్లు వెల్లడించారు. ఆలంపూర్ వారసత్వ సంపద పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన రూపకల్పన నుంచి ఉన్నతస్థాయిలో సమర్పణ వరకు జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో పాటు మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయ కృషి వల్ల ఆలంపూర్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ఆమోదం లభించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అలంపూర్ లోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల అభివృద్ధి, స్పాంజ్ పార్క్, పుష్కర ఘాట్ పునరుద్ధరణ, ఆధునిక పార్కింగ్ సదుపాయాల కల్పన, పాదచారుల కోసం ప్రత్యేక పెడెస్ట్రియన్ కారిడార్ల నిర్మాణం, ల్యాండ్స్కేపింగ్ ద్వారా పట్టణ సుందరీకరణ, ఆధునిక వీధి దీపాల ఏర్పాటు వంటి తదితర పనులను చేపడతామని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆలంపూర్ చారిత్రక వైభవం మరింత ఇనుమడించడంతో పాటు, భక్తులు, పర్యాటకులకు మరింత సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి ప్రముఖ పర్యాటక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాబాటకు హాజరైన టిజీఎస్పీ డిసిఎల్ రూరల్ జోన్ సిఈ బాలస్వామి



వర్గల్, నవంబర్ 5(మనం న్యూస్): క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కరిస్తూ మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజాబాట కార్యక్రమం చేపట్టినట్లు టీజీఎస్పి డీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం, గౌరారంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించి, వారి వ్యవసాయ అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్సరఫరాపరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. రైతుల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలను చూపడమేనని తమ లక్ష్యమని అన్నారు.అనంతరం గ్రామ పరిధిలో వాటర్ లెవల్ ఇండికేటర్ సహాయంతో నీటి మట్టాన్ని పరిశీలించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, వాటిపరిష్కారానికి అధికారులుసమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలని, చిత్తశుద్ధితో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఎస్ఈ చంద్రశేఖర్, గజ్వేల్ డిఇ స్వామి, ములుగు ఎడిఇ శ్రీనివాస్, వర్గల్ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫానుతో ప్రాథమికంగా రూ.1,918 కోట్ల నష్టం

- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంట పొలాలు
- రాష్ట్రంలో తుఫాను నష్టంపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- నేడు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన

అమరావతి, నవంబర్ 5,(మనం ప్రత్యేక ప్రతినిధి): మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ. 1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలు సీఎం తెలుసుకున్నారు. వరుసగా రెండు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాజాగా వెల్లడించిన ప్రాథమిక నష్టం అంచనాల ప్రకారం... తుపాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48-72 గంటల సమయం అవసరమని అధికారులు తెలిపారు.

విద్యుత్, రహదారుల పునరుద్ధరణ చర్యలు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని అధికారులు వివరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 1,103 ప్రభావిత 11 కేవీ ఫీడర్లలో 871 పునరుద్ధరించినట్టు సీఎంకు తెలిపారు. మరో 232 పునరుద్ధరించాల్సి ఉందని స్పష్టం చేశారు. 3,946 దెబ్బతిన్న 11 కేవీ విద్యుత్ స్తంభాల్లో 1,493 పునరుద్ధరించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లన్నీ పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఏపీ ట్రాన్స్కో పరిధిలో ప్రభావితమైన 25 హైటెన్షన్ ఫీడర్లలో 21 పునరుద్ధరించారు. ఆర్ అండ్ బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 206 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా, 204.14 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటి పునరుద్ధరణకు రూ.92.08 కోట్ల అవసరమని అంచనా వేశారు.

టెలికాం సేవలు 97 శాతం పునరుద్ధరణ

గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,428 టవర్లలో 30,518 టవర్లు తిరిగి పనిచేస్తున్నాయి. 97.1 శాతం సేవలు పునరుద్ధరించారు. బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పలుచోట్ల టవర్ల పునరుద్ధరణ జరగాల్సి ఉంది.

గోనెమ్మ గుడిలో.. అడ్డగోలుగా వివాహాలు

సంగారెడ్డి, నవంబర్ 5(మనంన్యూస్): పటాన్ చెరు పరిధిలోని గోనెమ్మ గుడిలో అడ్డగోలుగా వివాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల కలెక్టరేట్ కు ఫిర్యాదు కూడా అందినట్లు విశ్వసనీయ సమాచారం. చట్టబద్ధత లేకపోవడం కనీసం పెద్దల జోక్యం కూడా లేకుండా జరిగే ఇలాంటి వివాహాలతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. వధువు , వరుడు కు సంబంధించిన ఎలాంటి పూర్తి వివరాలు సేకరించకుండానే అక్కడ పెళ్లిళ్లు చేసేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరున్న పటాన్చెరును మినీ ఇండియాగా కూడా పరిగణిస్తూ ఉంటారు. ఇక్కడ అన్ని కులమతాల కు సంబంధించిన వారే కాకుండా ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి అలాగే దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి జీవనం కొనసాగిస్తున్న వారు అనేకమంది కనిపిస్తుంటారు. అందులోనూ గోనెమ్మ గుడిలో పెళ్లిళ్లు చేసుకునే జంటల వివరాలు ఏమాత్రం నమోదు కాకపోవడం శోచనీయం. ఇది పైకి కనిపిస్తున్నట్లు చిన్న అంశం కాదని అనేక సంక్లిష్ట అంశాలు ఇందులో ముడిపడి ఉంటాయని మేధావులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ఈ అడ్డగోలు వివాహాలకు ఫుల్ స్టాప్ పెట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కనీసం ఇక్కడ జరుగుతున్న వివాహాలను నమోదు చేసి క్రమపద్ధతిలోకైనా తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరద విపత్తుపై అధికారుల చర్యలకు అభినందనలు

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి
ఎస్డీఆర్ఎఫ్ పటిష్టంతో సత్ఫలితాలు
వరద సహాయక చర్యలు, నష్టం అంచనాలపై
ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి



సత్తుపల్లి, నవంబర్ 05(మనం న్యూస్): వరద విపత్తుపై అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలు, ప్రాణనష్టం లేకుండా చేపట్టిన చర్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం సింగరేణి కాలరీస్ గెస్ట్ హౌజ్ లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, వరద ముంపు నష్టాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాలు, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి హెడ్క్వార్టర్స్ పరిధిలో సంభవించిన వరదలు, వాటి నష్టాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. రాత్రి సమయంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించడానికి వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి రక్షించారన్నారు. బోట్లు బోల్తా పడినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినప్పటికీ, రాత్రి నుంచి ఉదయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అందరినీ సురక్షితంగా కాపాడటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రాత్రి రెండు పర్యాయాలు ప్రత్యేకంగా మాట్లాడి, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారన్నారు. కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షించడం వలన పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. 2023 డిసెంబర్లో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 ఆగస్టు చివరిలో మున్నేరు వాగు ఊహించని రీతిలో సుమారు 76-77 అడుగుల ఎత్తుతో ప్రవహించినప్పుడు భారీ నష్టం వాటిల్లిందని, అప్పట్లో ఎస్డీఆర్ఎఫ్ దగ్గర తగిన పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముఖ్యమంత్రి, మంత్రులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విపత్తు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి 1200 మందిని, ఫైర్ డిపార్ట్మెంట్ నుంచి 700 మందిని ఎంపిక చేసి ఎస్డీఆర్ఎఫ్ను పటిష్టం చేయడంతో పాటు, మొత్తం 1,900 మంది సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. సుమారు రూ. 260-270 కోట్ల వ్యయంతో అత్యుత్తమ అత్యాధునిక పరికరాలను ఎస్డీఆర్ఎఫ్ కు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏ మూలన విపత్తు వచ్చినా 45 నుండి 50 నిమిషాల లోపు సహాయక చర్యలు అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రాణనష్టం జరగకుండా అహర్నిశలు శ్రమించిన అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ప్రజాప్రతినిధులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, విపత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించిందని, ఎక్కడా ఎటువంటి ప్రాణహాని జరగకుండా పూర్తి స్థాయిలో ప్రాణాలను, ఆస్తులను కాపాడగలిగామని మంత్రి అన్నారు. విపత్తు సంభవించిన వెంటనే కేవలం 30 నుంచి 35 నిమిషాల వ్యవధిలోనే రెస్క్యూ టీమ్లు రంగంలోకి దిగాయని తెలిపారు.

నీళ్లలో ఇరుక్కుపోయిన వారిని సెల్ఫోన్ల ఆధారంగా గుర్తించి, టెక్నాలజీని, మ్యాన్పవర్ను సద్వినియోగం చేస్తూ సింగిల్ ప్రాణహాని కూడా జరగకుండా రక్షించడం జరిగిందన్నారు. రాత్రింబవళ్ళు నిద్రలేకుండా కష్టపడి పనిచేసిన ప్రతి అధికారిని, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంబంధిత శాఖ మంత్రిగా అభినందించారు. అశ్వారావుపేట నియోజకవర్గం, సత్తుపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తెగడం, చెరువులు పొంగిపొర్లడం వల్ల కింద ఉన్న వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయనారు. మల్లెపూవు వాగు ప్రవహించడం వల్ల డౌన్స్ట్రీమ్లో ఉన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రోడ్లపైకి చెత్తాచెదారం, వరద నీరు చేరడం వల్ల కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్ రోడ్లకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. విపత్తు ప్రాతిపదికన రానున్న 2-3 రోజుల్లోగా నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి డీటెయిల్ ఎస్టిమేట్స్ను ప్రభుత్వానికి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు. కేవలం అధికారుల అంచనాలే కాకుండా, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు స్వయంగా ఫీల్ విజిట్లు నిర్వహించి, నిజంగా నష్టపోయిన రైతులను గుర్తించి ఆ వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గత 36 గంటలుగా నిరంతరం శ్రమించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విపత్తు నిర్వహణలో కష్టపడిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సిబ్బందిలో ఎవరికైనా ఇళ్లు లేని పక్షంలో, వారికి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడతామని, అర్హులైన వారి జాబితాను పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇరిగేషన్, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ, విద్యుత్, తాగునీరు శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల వారీగా జరిగిన వాస్తవ నష్టాలపై తక్షణ నివేదికను రానున్న 2-3 రోజుల్లో అందజేయాలని మంత్రి ఆదేశించారు.

సమీక్షలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితులలో సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద చిక్కున్న మత్స్యకారులను జిల్లా యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల అప్రమత్తతతో పూర్తిగా రక్షించడం జరిగిందన్నారు. చెరువు నీటి మట్టం, ప్రవాహ ఉధృతీ సమయంలో సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో 8 మంది మత్స్యకారులు తెప్ప బోటును వేసుకుని చెరువులోకి వెళ్లడం జరిగిందని, వరద ఉధృతి పెరగడంతో వారు అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి, తక్షణ సహాయక చర్యల కోసం అందరినీ సమాయత్తం చేశామన్నారు. అప్పటికే భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఇక్కడికి తక్షణమే రప్పించగా, వారు కేవలం 25 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. మొదటి బోటు ద్వారా వెళ్లి, ఈత రాని ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారున్నారు. ఆ తర్వాత రెండవ బోటు సహాయంతో మిగతా వారిని రక్షించడానికి వెళ్లిన సమయంలో, వరద ప్రవాహం మరింత పెరగడంతో రెండు బోట్లు బ్యాలెన్స్ కోల్పోయి ఎస్డీఆర్ఎఫ్ బృందం కూడా నీటిలో పడిపోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే అప్రమత్తమైన యంత్రాంగం విజయవాడ నుండి కెప్టెన్ కిరణ్, నీరజ్ ల నేతృత్వంలోని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించామని తెలిపారు. పోలీసు శాఖ, ఇతర యంత్రాంగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ లొకేషన్ ట్రేసింగ్ ఉపయోగించి రాత్రి సమయంలో కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాహసోపేతంగా వ్యవహరించిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం చొరవతో మొత్తం 8 మంది మత్స్యకారులను, రెస్క్యూ సిబ్బందిని ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పూర్తిగా రక్షించగలిగామన్నారు. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న విపత్తు యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాకు రెడ్ అలర్ట్ నేపథ్యంలో నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమై, సహాయక చర్యలను వేగవంతం చేసిందని తెలిపారు. గతంలో భద్రాచలం డివిజన్ చెర్ల, దుమ్ముగూడెం, గోదావరి పరివాహక ప్రాంతాల పరిధిలో వరద ముప్పు ఎక్కువగా ఉండేదని, అయితే ఈసారి కొత్తగూడెం డివిజన్లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ వర్షపాతం నమోదైందని అన్నారు. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన వెంటనే రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పోలీసు శాఖలతో పాటు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఇతర విభాగాల అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరినీ అలర్ట్ చేసి హెడ్క్వార్టర్స్లోనే అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ముల్కలపల్లి సమీపంలో ఐటీడీఏ వైపు వెళ్తుండగా వరదలో చిక్కుకుని, చెట్టుపై తలదాచుకున్న 40 సంవత్సరాల మహిళను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయన్నారు. ముల్కలపల్లిలోనే వాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగిన వేళ, ఒక 20 ఏళ్ల యువకుడు ప్రాణాపాయ స్థితిలో చెట్టుపైకి ఎక్కగా, అతనికి లైఫ్ జాకెట్లు, రోప్లు, డ్రోన్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారన్నారు. దేవాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లిన 11 మంది గిరిజనులు వరద నీటిలో చిక్కుకోగా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని వారందరినీ క్షేమంగా బయటకు తరలించాయన్నారు. తదనంతరం అదే బృందం సత్తుపల్లిలోని అత్యవసర ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొందన్నారు. భారీ వర్షాల కారణంగా వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని, అలాగే పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో పూర్తిస్థాయి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, రాబోయే రెండు రోజుల్లో కచ్చితమైన నష్ట పరిహార నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ మాట్లాడుతూ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా విజయవంతంగా సహాయక చర్యలు పూర్తి చేశాయన్నారు. వరద ముప్పును ముందే అంచనా వేసి, ములకలపల్లి పోలీస్ స్టేషన్, దమ్మపేట, అశ్వారావుపేటలలో ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ముందుగానే స్టాండ్బై ఉంచడం జరిగిందన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో వరద ఉధృతి పెరిగిన వెంటనే, కలెక్టర్ ఆదేశాల మేరకు దమ్మపేట, కొత్తగూడెం వైపు ఉన్న ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ఆ ప్రాంతానికి రప్పించడం జరిగిందని, తొలి విడతలో ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా రెస్క్యూ చేసామన్నారు. అనంతరం నీటి మట్టం మరింత పెరగడంతో, 6వ బెటాలియన్ ఎస్.డి.ఆర్.ఎఫ్, ఫైర్ డిపార్ట్మెంట్ బృందాలు కూడా రంగంలోకి దిగాయని, రాత్రంతా శ్రమించి మరో ఐదుగురిని రక్షించడం జరిగిందన్నారు. ఉదయం 5:30 గంటల నుండి రెండవ విడత ఆపరేషన్ ప్రారంభించి, డ్రోన్లు, ఆధునిక పరికరాలు, మోటార్ బోట్లను ఉపయోగించి చెట్లపై చిక్కుకున్న వారి లొకేషన్లను మ్యాప్ చేసి ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాల సహాయంతో నిర్దిష్ట ప్రణాళికతో అందరినీ సురక్షితంగా కాపాడడం జరిగిందన్నారు. ఈ సమయంలో రెవెన్యూ, పోలీస్, ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో రేయింబవళ్లు శ్రమించడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రశాంతంగా రెస్క్యూ ఆపరేషన్లు ముగిసాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఖమ్మం జిల్లా యంత్రాంగం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల ప్రజల ప్రాణాలు పూర్తిగా కాపాడబడ్డాయన్నారు.

సమీక్షలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అకస్మాత్తుగా ఎదురైన విపత్తును సమన్వయంతో, సాహసంతో ఎదుర్కొని అందరినీ రక్షించారని, అధికారులు, సహాయక బృందాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లా యంత్రాంగం, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేశారన్నారు. సమీక్షలో పాల్గొన్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. వరదతో జరిగిన పంట నష్టాన్ని అందించాలన్నారు. విపత్తులో పాల్గొన్న వారిని అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ఎస్డీఆర్ఎఫ్!



- **వరద సహాయక చర్యల్లో మీ సేవలు మరువలేనివి..**
- **సిబ్బందిని అభినందించిన మంత్రి పొంగులేటి**

సత్తుపల్లి, నవంబర్ 5(మనం న్యూస్): భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలేనివని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతో పాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సహాయక చర్యలను అభినందించారు. గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి మంత్రి పొంగులేటి సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు వద్ద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలంలో మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల వద్ద గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో చూపిన తెగువకు ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు.

అన్నదాత కన్నీటిని తుడవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే!



- **ముసురు తుఫాన్తో వేలాది ఎకరాల్లో పంట నష్టం**
- **ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి నీటిపాలు**
- **తక్షణమే నష్టపరిహారం అందించాలి**
- **సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్**

సుజాతనగర్, నవంబర్ 5 (మనం న్యూస్) : ముసురు తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల భారీ వర్షాలు అన్నదాతల ఆశలను ఆవిరి చేశాయి. ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి, వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రకృతి వైపరీత్యం రూపంలో వచ్చిన ఈ నష్టం రైతుల కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరానికి సుమారు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. వరి పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పంట చేతికొచ్చే దశలో వర్షాలు కురవడంతో రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గురువారం సుజాతనగర్ సీపీఐ మండల పార్టీ ఆధ్వర్యంలో మేయర్ మూడు గణేష్తో కలిసి సుజాతనగర్ పరిధిలోని వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను ఎస్కే సాబీర్ పాషా పరిశీలించారు. బాధిత రైతులతో నేరుగా మాట్లాడి పంటల పరిస్థితి, పెట్టుబడులు, జరిగిన నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించే ప్రతి గింజ దేశ ప్రజల ఆకలి తీర్చడానికి ఉపయోగపడుతుందని, అలాంటి రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు అకాల వర్షాలు మరింత భారంగా మారాయని పేర్కొన్నారు. పంట నష్టంతో అప్పులు ఎలా తీర్చాలి? కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? అనే ఆందోళనలో రైతులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా తక్షణమే స్పందించాలని, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. నీట మునిగిన ప్రతి పొలాన్ని పరిశీలించి, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా నష్ట వివరాలను నమోదు చేయాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అలాగే ఎకరాకు రైతులు పెట్టిన పెట్టుబడిని, పంట దిగుబడికి జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగిన నష్టపరిహారం ప్రకటించాలని, నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం నేరుగా జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన పంట రుణాల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కోరారు. రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుందని, వ్యవసాయం బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. రైతుల కన్నీళ్లు తుడిచి, వారికి న్యాయం జరిగే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని సాబీర్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడు గణేష్, సీపీఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీను, భూక్య దస్రు, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ధర్మారావు, దండు నాగేశ్వరరావు, భూక్య శ్రీను, ధర్మ సాయి, ప్రతాప్ సింగ్, హరిబాబు, శంకర్, సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బేతుపల్లి చెరువు కథ సుఖాంతం



- **అందరూ సురక్షితం**
- **బేతుపల్లి చెరువును సందర్శించిన మంత్రి తుమ్మల**
- **రాష్ట్ర ప్రభుత్వం తరపున అందరికీ అభినందనలు**

సత్తుపల్లి, నవంబర్ 5(మనం న్యూస్): బేతుపల్లి చెరువు కథ సుఖాంతమైంది. అందరూ సురక్షితంగా బయటకు వచ్చారు. బుధవారం రాత్రి నుంచి ఇక్కడ సంఘటనను పర్యవేక్షించిన జిల్లా ఉన్నతాధికారులకు, ఎంఎల్ఏ డాక్టర్ మట్టా రాగమయి దయానంద్కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. గురువారం ఉదయం సత్తుపల్లి మండల పరిధిలోని బేతుపల్లి చెరువు వద్ద ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని మంత్రి తుమ్మల కలుసుకొని వారిని అభినందించారు. బుధవారం సాయంత్రం ఎనిమిది మంది మత్స్యకారులు చిక్కుకొనగా వారిని రక్షించేందుకు వెళ్లిన ఎస్డిఆర్ఎఫ్ బృందాల పడవ బోల్తా పడిన సంఘటన విధితమే. వాళ్లందరిని క్షేమంగా ఒడ్డుకి చేర్చిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను, ఫైర్స్ సిబ్బందిని మంత్రి తుమ్మల అభినందించారు. నిన్న సాయంత్రం నుంచి బేతుపల్లి చెరువు వద్ద ఉండి ఈ దుర్ఘటనను పర్యవేక్షించిన రాత్రి వేళ అయినా చిమ్మ చీకటిలో ఈ 16 మంది సురక్షితంగా బయటికి రావటం ఆనందాన్ని కలిగించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ సంఘటనను మంత్రి తుమ్మల నిరంతరం పర్యవేక్షించారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు మంత్రి పరిశీలన

దమ్మపేట, నవంబర్ 05(మనం న్యూస్) : దమ్మపేట మండలంలో ముసురు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న చెరువులు వాగులు రహదారులు పంట పొలాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, అధికారులతో కలిసి పరిశీలించారు. తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని సమీక్షించి ప్రజలకు రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం. దురదపాడు మల్లెపూల భాగవతం పరిశీలించారు. దురదపాడు మధ్యలోని మల్లెపూలు వాగు వంతెనను మంత్రి పరిశీలించారు. వరద ఉధృతకు దెబ్బతిన్న



రహదారులు పొలాలను పరిశీలించారు. తెగిపోయిన విద్యుత్తు తీగలు స్తంభాలను వెంటనే పునర్దించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్, . అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాఘమయి దయానంద్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి చిట్టిబాబు, చిన్న శెట్టి యుగంధర్, చిన్న శెట్టి గోపి, వనమాల శ్రీనివాసరావు, పసుమర్తి పెద్దబాబు, వాసం శ్రీనివాస్, సొంగ ఏసుమణి, పాల్గొన్నారు.

నిరుపేద ఆడబిడ్డ వివాహానికి రూ.30 వేల ఆర్థిక సాయం



ములుగు,నవంబర్ 5, మనం ప్రతినిధి: నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి అండగా నిలిచి చేయూతనం దించారు. ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో మంత్రి సాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అం డగా నిలుస్తూ, వారి కష్టాల్లో పాలుప ంచుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

శభాష్ కలెక్టర్

కలెక్టర్‌ను ఆలింగనం చేసుకున్న మంత్రి తుమ్మల

- **బేతుపల్లి ఘటనలో సమయస్ఫూర్తిగా వ్యవహరించారంటూ కితాబు**



ఖమ్మం, నవంబర్ 5(మనం బ్యూరో): ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. శభాష్ కలెక్టర్ అంటూ భావోద్వేగంతో ఆలింగనం చేసుకున్నారు. సంఘటన జరిగిన విషయం తెలియగానే స్పందించిన ఆ ప్రాంతానికి వెళ్లి అందరినీ సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ నష్టమూ లేకుండా చేశారంటూ కితాబిచ్చారు. అటు ఎంఎల్ఏతోనూ, రాష్ట్ర ప్రభుత్వంతోనూ ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు ముమ్మరం చేసి ఎలాంటి విపత్తు జరగకుండా వ్యవహరించారని అభినంద నలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్త గూడెం ఎస్పి రోహిత్ రాజు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 64.38 శాతం పోలింగ్ నమోదు

- కూడేరు మండలం మరుట్ల రెండవ కాలనీలో టిడిపి, వైసిపి వర్గాల ఘర్షణ
- బ్యాలెట్ పత్రాలను బయటపడవేసిన నాయకులు
- ఓ వర్గానికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని వ్యతిరేకించిన పార్టీ నేతలు



అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 05: మనం న్యూస్ : అనంతపురం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ 2వ సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. కూడేరు మండలం మరుట్ల రెండవ కాలనీలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. టిడిపి వర్గానికి వత్తాసు పలుకుతున్నారంటూ వైసీపీ వర్గం వ్యతిరేకించి ఘర్షణకు దిగింది. పోలింగ్ కేంద్రంలో ఉన్న బ్యాలెట్ బాక్స్ ను ఎత్తుకొని వచ్చి అందులోని బ్యాలెట్ పత్రాలు బయట కుమ్మరించారు. ఇక్కడ ఎన్నికలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నవంబర్ 5వ తేదీన జరిగిన ఈ పోలింగ్లో సాయంత్రం 5.00 గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా 64.38 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటర్ల ఉత్సాహం:

జిల్లాలోని 28 మండలాల్లో 28 జెడ్పీటీసీ, 353 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,44,920 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం 5 గంటల వరకు 8,01,535 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు.

శెట్టూరులో అత్యధికం.. అనంతపురంలో అత్యల్పం:

పోలింగ్ శాతానికి వస్తే, శెట్టూరు మండలంలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 75.33 శాతం పోలింగ్ నమోదైంది. దీని తర్వాత కుడేరు (72.62 శాతం), పెద్దపప్పూరు (72.50 శాతం), కళ్యాణదుర్గం (71.25 శాతం), డి. హిరేహాళ్ (71.21 శాతం), విడపనకల్ (71.01 శాతం), కణేకల్ (70.45 శాతం), మరియు బ్రహ్మసముద్రం (70.26 శాతం) మండలాల్లో కూడా 70 శాతానికి పైగా ఉత్సాహంగా పోలింగ్ జరిగింది.

కానీ, పట్టణ ప్రాంతమైన అనంతపురం మండలంలో మాత్రం ఓటర్లు నిరాసక్తత చూపారు. ఇక్కడ అత్యల్పంగా కేవలం 48.95 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది.

● ప్రముఖుల ఓటు హక్కు: అనంతపురం జిల్లా గంగులవాయిపాళ్యం పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ సీడబ్ల్యూసీ (సి డబ్ల్యూ సి) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి సాధారణ పౌరుడిలా క్యూలైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● పోలింగ్ సరళి, భద్రత: జిల్లాలో అత్యధిక సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్కాస్టింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణ మధ్య అధికారులు పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

చెదురుమదురు సంఘటనలు: కూడేరు మండలం మరుట్ల, బెస్తరపల్లి లాంటి కొన్ని గ్రామాల వద్ద రాజకీయ వర్గాల మధ్య తోపులాటలు, బ్యాలెట్ బాక్స్ దెబ్బతినడం వంటి చిన్నపాటి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు అధికారులు స్ట్రాంగ్ రూమ్లకు తరలిస్తున్నారు. శనివారం (నవంబర్ 7న) ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

పోలింగ్ వేళ మలసముద్రంలో ఉద్రిక్తత..

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, ఇన్ స్పెక్టర్ మధ్య వాగ్వాదం!
- ఓ ఇంట్లో జనం గుమిగూడటంపై పోలీసుల అభ్యంతరం..
- ఇరువర్గాల మధ్య మాటామాటా
- అక్కడే బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా మాజీ మంత్రి నినాదాలు



గోరంట్ల, నవంబర్ 5, మనం న్యూస్: ఓవైపు ప్రజాస్వామ్య పండుగగా భావించే స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగుతుండగా.. మరోవైపు మలసముద్రం గ్రామంలో చోటుచేసుకున్న పరిణామాలు ఒక్కసారిగా రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. ఓ ఇంటి వద్ద జనం గుమిగూడిన విషయంపై మొదలైన వివాదం మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, గోరంట్ల పోలీసుల మధ్య వాగ్వాదానికి దారితీసింది.

గోరంట్ల మండల పరిధిలో గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలో మలసముద్రం గ్రామంలోని ఓ ఇంటి వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడి ఉన్నారన్న సమాచారంతో గోరంట్ల ఇన్స్పెక్టర్ శేఖర్ అక్కడికి చేరుకున్నారు. పోలింగ్ సమయంలో ఒకేచోట గుమిగూడి ఉండకూడదని, వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు.

అయితే ఇంటి యజమాని తాము భోజనాలు చేస్తున్నామని పేర్కొంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పోలీసుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆమెకు, ఇన్స్పెక్టర్ శేఖర్కు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రి అక్కడే బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి నేపథ్యంలో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామాలతో మలసముద్రం గ్రామంలో కొద్దిసేపు రాజకీయ వాతావరణం వేడెక్కగా, ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటన మినహా గోరంట్ల మండలంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది

సాకే లక్ష్మికి జాతీయ సాహస బాలల పురస్కారం ఇవ్వాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ
- తోటి విద్యార్థిని ప్రాణాలు కాపాడేందుకు దుండగుడిని ఎదుర్కొన్న లక్ష్మి ధైర్యం అసాధారణం



ధర్మవరం, నవంబర్ 5, మనం న్యూస్: రాప్తాడు ఉన్నత పాఠశాలలో తోటి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటనలో స్నేహితురాలిని కాపాడేందుకు ప్రాణాలకు తెగించి దుండగుడిని ఎదుర్కొన్న సాకే లక్ష్మి అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ కొనియాడారు.

లక్ష్మి సాహసానికి జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలని కోరుతూ నవంబర్ 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఆమెకు జాతీయ సాహస బాలల పురస్కారం (నేషనల్ బ్రేవరీ అవార్డు) అందించాలని సిఫార్సు చేశారు.

ఆపద సమయంలో తన ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిసినా వెనుకడుగు వేయకుండా తోటి విద్యార్థినికి రక్షణగా నిలవడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. లక్ష్మి ప్రదర్శించిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిస్వార్థ సేవ దేశంలోని విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన లక్ష్మి తన సాహసంతో ధైర్యం, మానవత్వం, బాధ్యత వంటి గొప్ప విలువలను చాటిచెప్పిందని మంత్రి ప్రశంసించారు. ఆమె తెగువకు జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతిని కోరారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



గార్లదిన్నె నవంబర్ 5 మనం న్యూస్ : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థి గంజే నాగరాజు పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను, ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న విధానాన్ని గమనించారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.

పోలింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

- ప్రతి ఓటరుకూ ఇబ్బందులు లేని వాతావరణం కల్పించాలి!
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం



గోరంట్ల, నవంబర్ 5, మనం న్యూస్: ఎన్నికల నిర్వహణలో చిన్నపాటి లోపాలకు కూడా తావులేకుండా.. ఓటు వేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ గోరంట్లలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గోరంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పోలింగ్ గదులను పరిశీలిస్తూ ఓటర్లకు కల్పించాల్సిన కనీస సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు నీడ కోసం టెంట్ల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు.

వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు సులభంగా చేరుకునేలా ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సాఫీగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు.

అనంతరం ఓటరు జాబితా సవరణలు, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల సంఖ్య, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై స్థానిక రెవెన్యూ, ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్వో డాక్టర్ ప్రకాష్, తహసీల్దార్ మధునాయక్, ఎంపీడీవో కమలాబాయి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సునీత



ధర్మవరం(రామగిరి), నవంబర్ 5 మనం న్యూస్: ధర్మవరం డివిజన్ పరిధిలోని రామగిరి మండలం నసనకోట గ్రామంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి, నల్లచెరువు జెడ్పీటీసీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్ గురువారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు



పాలకొల్లు, నవంబర్ 5,మనం ప్రతినిధి: 3పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యులు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) మృతి పట్ల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాలకొల్లులో బుధవారం డాక్టర్ బాబ్జి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొని స్వయంగా పాడె మోసి తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. డాక్టర్ బాబ్జి వైద్య రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ విశిష్ట సేవలందించి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఆయన మరణవార్తను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ బాబ్జి సేవలకు తగిన గౌరవం దక్కాలనే ఉద్దేశంతో ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించేలా అప్పటికప్పుడు ప్రత్యేక అనుమతి ఉత్తర్వులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. దీంతో డాక్టర్ బాబ్జి అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ప్రముఖ వైద్యునిగా, ప్రజాప్రతినిధిగా ఆయన అందించిన సేవలు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని మంత్రి నిమ్మల అన్నారు. డాక్టర్ బాబ్జి వంటి విశిష్ట వ్యక్తికి గౌరవం ఇవ్వడం అంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని పేర్కొన్నారు.అధికారులు,వేలాది మంది అభిమానులు మధ్య డాక్టర్ బాబ్జి అంత్య క్రియలు ఘనంగా జరిగాయి.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



కాట్రేనికోన నవంబర్ 5 మనం ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి మండల వ్యాప్తంగా 21 ఎంపీటీసీ స్థానాలకు గాను ఒక స్థానం ఏకగ్రీవం కావడంతో మిగిలిన 20 ఎంపీటీసీ స్థానాలకు 46 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఆయా స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మండలంలో సమస్యాత్మకమైన గ్రామాలు ఉండడంతో అటు అధికారులు ఇటు రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనకు గు అయినప్పటికీ ఎన్నికల ప్రశాంతంగా జరగడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పల్లం లో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు. మండల వ్యాప్తంగా 65 017 మంది ఓటర్లు ఉండగా 38176 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 58.71 శాతం నమోదు అయి నట్లు రిటర్నింగ్ అధికారి జి మమ్మీ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముమ్మిడివరం సీ ఐ మోహన్ కుమార్, స్థానిక ఎస్ ఐ దుర్గా శ్రీనివాస్, అదనపు ఎస్ ఐ సత్యనారాయణ, ఎస్ ఐ శ్రీనివాస్ సిబ్బంది విధులు నిర్వహించారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు మహమ్మద్ అబ్దుల్ రహుఫ్ షేక్



తాడేపల్లిగూడెం, నవంబర్ 5 ,(మనం న్యూస్) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఖర్చులను పారదర్శకంగా పరిశీలించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు మహమ్మద్ అబ్దుల్ రహుఫ్ షేక్ అధికారులకు సూచించారు.గురువారం స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ లో 7వ తేదీన నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ జరిగే సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.7వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని పెంటపాడు, అత్తిలి, తణుకు, ఇరగవరం, తాడేపల్లిగూడెం మండలాల ఎంపీటీసీ, జడ్పీటీసీ కౌంటింగ్ ప్రక్రియ ఇక్కడే జరుగుతుందని ఆయన చెప్పారు.

ప్రశాంతంగా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి నిమ్మల



పాలకొల్లు, నవంబర్ 5,మనం ప్రతినిధి: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, ఎలమంచిలి మండల ప్రాంతాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానిక ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఫ్యామిలీ అగర్తి పాలెం లో , , మేడిది ఉషారాణి జాన్ రాజు అగర్తి పాలెం లో , కొడవటి నాగ లక్ష్మి వరబాబు యలమంచిలి లో, ఎంపీపి అభ్యర్థులు.. అంగర వీరభద్ర కుమార్ కాపవరం లో ,పీతల శ్రీనివాస్ పెనుమర్రు లో ను ,తాళ్ల నాగరాజుమేడపాడులో , ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలకొల్లు, యలమంచిలి మండలంల లో పోలింగ్ శాతం..70 వరకు జరిగినట్లు సమాచారం.పాలకొల్లు లో 70.4 పోలింగ్ శాతం అయినట్లు ఆర్ ఓ పి మురళి కృష్ణ తెలిపారు.కాగా ఓ పార్టీ ఓటుకూ రు. 1500, మరో పార్టీ ఓటుకు రూ. 500 చొప్పున నజరాణాలు పంచినట్లు ప్రచారం సాగుతోంది. ఎలమంచిలి లో ఓటు వేయడానికి వెళ్తూ ఒక వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిసింది.

తన ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు

- రఘువీరారెడ్డి

మడకశిర, నవంబర్ 05,మనంన్యూస్: మడకశిర మండలం గంగులవాయిపాళ్యంలోని పోలింగ్ స్టేషన్ లో గురువారం మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి తన హక్కును వినియోగించుకున్నారు. గురువారం జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సరళి పట్ల ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరుకూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా రఘువీరారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేసారు.అదేవిదంగా పెద్దాయన సతీమణి శ్రీమతి సునీతరఘువీర్, తనయుడు అమిత్ వీర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి. ప్రభాకర్ రెడ్డి తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



వారి గెలుపు మనకు లాభమా?

● హెచ్-1 బీ వీసాలపై ఆశతో యువత





వాషింగ్టన్, నవంబర్ 4 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బ తగలడం భారత్‌కు లాభమా..? నష్టమా..? ఇప్పుడు చాలామందిలో ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రశ్న ఇది. ఈ ఫలితాలతో భారత్ చాలా లాభపడుతుందని పలువురు భావిస్తున్నారు. ఇక్కడ అందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఈ ఎన్నికలతో ట్రంప్ బలహీనపడ్డారంతే! పదవీచ్యుతుడేమీ కావడం లేదు. ట్రంప్ అధ్యక్షుడిగా కొనసాగే రానున్న రెండేళ్లూ ఆయనతో చర్చల్లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ లాభపడేందుకు ఢిల్లీ ప్రయత్నించాలి. ట్రంప్ సుంకాల కొరడా వల్ల భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలు ఇటీవలి కాలంలో దెబ్బతిన్నాయి. మన దేశ ఎగుమతులపై ఆయన ఒక దశలో 50% వరకూ సుంకాలు విధించారు. తర్వాత 18%కు తగ్గించారు. ఈ భారాన్ని మరింత తగ్గించేలా డెమోక్రాట్లు ట్రంప్‌ను ఒత్తిడి చేయొచ్చు! సుంకాల విషయంలో ఆయన తీరుపై వారు విచారణ జరిపే అవకాశాలు ఉన్నాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇప్పుడు ఇరు దేశాలకు కీలక పరీక్ష.

హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు, ఫీజుల పెంపు వంటి ట్రంప్ నిర్ణయాలు భారతీయ ఐటీ నిపుణులు, కంపెనీలకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. ఆయన ఇమ్మిగ్రేషన్ విధానాలను డెమోక్రాట్లు గట్టిగా సవాలు చేస్తే.. భారతీయులకు కొంత ఉపశమనం దక్కొచ్చు. అయితే కొన్ని కొత్త హెచ్-1బీ దరఖాస్తులపై విధించిన లక్ష డాలర్ల ఫీజు ఈ ఫలితాలతో ఇప్పటికిప్పుడు రద్దు కాదు.

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేవారిపై 100% సుంకాలు విధిస్తానని ట్రంప్ ఇన్నాళ్లూ బెదిరించారు. ఇప్పుడు ఆ విషయంలో కొంత వెనక్కి తగ్గొచ్చు. అదే జరిగితే.. భారత్‌కు చాలా ఊరట లభించినట్లే. ఈ ఏడాది ఆగస్టులో మన దేశం దిగుమతి చేసుకున్న చమురులో 44% రష్యా నుంచి వచ్చిందే. డెమోక్రాట్ల విజయంతో ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యంలో పెద్దగా మార్పులేమీ ఉండకపోవచ్చు. ఇరు దేశాలు నిరుడు అక్టోబరులోనే పదేళ్ల రక్షణ ఫ్రేమ్‌వర్క్‌పై సంతకాలు చేశాయి. చైనా విషయంలో ఆందోళన.. ఢిల్లీ, వాషింగ్టన్‌లను కలిసికట్టుగానే ఉంచొచ్చు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో మధ్యవర్తిత్వం చేశానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, పాకిస్థాన్ సైనిక నాయకత్వంతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలు భారత్కు కొంత అసౌకర్యాన్ని కలిగించాయి. డెమోక్రాట్లు గెలిచినంత మాత్రాన పాక్ను అమెరికా దూరం పెడుతుందని మాత్రం భావించలేం.

రెండు ఎన్నికలు, రెండు పరాజయాలు. ఒక అపరిష్కృత యుద్ధం. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు డెమోక్రాట్లకు భారీ విజయం కట్టబెట్టడంతో అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆ దేశ పార్లమెంటుపై పట్టు పూర్తిగా కోల్పోయారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పార్లమెంటులో మెజారిటీ సాధించలేక చతికిలపడ్డారు. పదవి నిలబెట్టుకునేందుకు వీలుగా మెజారిటీ కూడగట్టేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో ఇర్నా యుద్ధానికి చేతులు కలిపిన నాయకులిద్దరూ సొంత గడ్డపై ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని హతమార్చినా యుద్ధం అమెరికాకు కచ్చితమైన విజయాన్ని అందించలేదు. ఉద్రిక్తతలు ప్రారంభమై నెలలు గడిచినా అమెరికా, ఇరాన్ల మధ్య అంగీకారం సుదూర స్వప్నంగానే మిగిలిపోయింది. మధ్యంతర ఎన్నికలకు కొన్ని గంటలకు ముందు అమెరికా హర్మూజ్ జల సంధికి సమీపంలో ఇర్నా దాడి చేసింది. ఇప్పుడు ట్రంప్, నెతన్యాహులు ఇద్దరూ తమ స్వదేశాల్లో ఓటమి చవిచూసిన నేపథ్యంలో ఇరాన్ యుద్ధం ఏ దిశగా సాగనుంది.. సొంతింట్లో పరాజయం ట్రంపును ఇరాన్తో సంధికి ప్రోత్సహిస్తుందా... లేక అమెరికా, ఇజ్రాయెల్లు తమ వైఖరిని మరింత కఠినంగా మార్చుకుంటాయా అనేది ఆసక్తికరం!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్ ట్రంప్ పార్టీకి ఎదురైన ఘోర పరాజయం ఇరాన్లో ప్రతిధ్వనించింది. ఇరాన్ ఇస్లామిక్ విప్లవ కాలంలో అమెరికా రాయబార కార్యాలయాన్ని దిగ్బంధించిన ఘటన 47వ వార్షికం సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రదర్శనలో ఇరాన్ ప్రజలు తమ దేశ జెండాలు ఊపుతూ బ్యానర్లు, ప్లకార్డులతో పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. 'ట్రంప్‌ను చంపుతాం', 'అమెరికాకు మరణం', 'ఇజ్రాయెల్కు మరణం' అంటూ గట్టిగా నినాదాలు చేశారు. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల గెలుపు ఇరాన్ సాధించిన విజయమని ఇక్కడి నేతలు పేర్కొంటున్నారు.

మధ్యంతర ఎన్నికల్లో పరాభవంతో రిపబ్లికన్లు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. పార్టీ ఓటమికి ట్రంప్ వివాదాస్పద విధానాలే కారణమని వారిలో చాలామంది బహిరంగంగానే నిందిస్తున్నారు. ఈ పరిణామాలు రిపబ్లికన్ల మధ్య విభేదాలను, పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుండటాన్ని సూచిస్తున్నాయి. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ల తరఫున బరిలో దిగే నేత ఎవరన్నదానిపై ఇప్పట్నుంచే చర్చ మొదలవ్వొచ్చు. ట్రంప్ వారసుడి రేసులో ప్రస్తుత ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ముందున్నప్పటికీ.. విదేశాంగ మంత్రి మార్కో రూబియో, బ్రియాన్ కెంప్, టెడ్ క్రుజ్, రాన్ డిసాంటిస్లతో పాటు డొనాల్ ట్రంప్ జూనియర్ల పేర్లు ఈ జాబితాలో వినిపిస్తున్నాయి.

జంతర్ మంతర్ హింస..

ఎలాంటి ఫిర్యాదులూ అందలేదు! విచారణ కమిటీ

ఢిల్లీ, నవంబర్ 4 : కాక్రోచ్ జనతా పార్టీ జులైలో జంతర్ మంతర్లో నిర్వహించిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు 'హైపవర్డ్ విచారణ కమిటీ'ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, హింస వల్ల ప్రభావితమైన వ్యక్తుల నుంచి ఇప్పటివరకు దాదాపు ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని ఆ కమిటీ గురువారం సర్వోన్నత న్యాయస్థానానికి తెలియజేసింది. తగిన ఆధారాలు లేకపోవడం వల్ల ఆ ఘటనలపై కమిటీ ప్రస్తుతానికి ఎలాంటి నిర్ధారణకు రాలేకపోతోందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం పేర్కొంది.

''ఢిల్లీలో జులై 20న సీజేపీ నేతృత్వంలో 'చలో పార్లమెంట్' మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసపై ఫిర్యాదులను ఆహ్వానిస్తూ 149 వార్తాపత్రికల్లో నోటీసులు జారీ చేశాం. అయితే, ఆన్‌లైన్‌లో గానీ, నేరుగా గానీ దాదాపు ఎటువంటి ఫిర్యాదులూ అందలేదు. అక్టోబర్ 21న సైతం మరోసారి ఫిర్యాదులను ఆహ్వానించాం'' అని సుప్రీంకోర్టుకు విచారణ కమిటీ తెలియజేసింది. ఈ క్రమంలోనే జంతర్మంతర్ హింసకు సంబంధించిన పిటిషన్లు, వీడియోలు, ఫిర్యాదులను హైపవర్డ్ కమిటీకి బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదేవిధంగా నిర్ణీత వ్యవధిలో మధ్యంతర నివేదికలను సమర్పించాలని కమిటీకి సూచించింది.

నీట్ పేపర్ లీక్కు వ్యతిరేకంగా చేపట్టిన నాటి జంతర్మంతర్ ప్రదర్శనల్లో నిరసనకారులకు వ్యతిరేకంగా పోలీసు సిబ్బంది పెల్లెట్ గన్లు ప్రయోగించడం, ముందస్తు హెచ్చరికలు లేకుండా బాష్పవాయువు ప్రయోగించడం వంటి దౌర్జన్యకర, హింసాత్మక చర్యలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 18న సర్వోన్నత న్యాయస్థానం జారీచేసిన ఆదేశాల మేరకు.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాషిడ్డి సారథ్యంలో హైపవర్డ్ విచారణ కమిటీ ఏర్పాటైంది. బాధితులు సాధారణ పౌరులైనా, పోలీసు సిబ్బంది అయినా ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించింది.



భారత పాలకులకు హెచ్చరిక..

● ప్రొఫెసర్ వకుళాభరణం వంశీ



హైదరాబాద్, నవంబర్ 4 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఐదు కీలకాంశాలపై ట్రంపును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, అన్ని వర్గాల్లోనూ ఈ వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని మస్సాచుసెట్స్లో నివసిస్తున్న తెలుగు ప్రముఖులు, ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ వకుళాభరణం వంశీ అభిప్రాయపడ్డారు. వరంగల్ నిట్ నుంచి బీటెక్ పట్టా పొందిన ఆయన అమెరికా వెళ్లి ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్గా స్థిరపడ్డారు. కొన్నాళ్లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ అసోసియేట్ ప్రొఫెసర్గా సేవలు అందించారు. ప్రస్తుతం మస్సాచుసెట్స్ ఆమ్హెస్ట్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. ట్రంప్‌నకు వ్యతిరేకంగా ఫలితాలు రావడానికి పలు కారణాలున్నాయన్నారు.

ట్రంప్ తిరిగి అధ్యక్షునిగా ఎన్నికయ్యాక.. ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. అన్ని వర్గాల ప్రజలపైనా ఈ భారం పడింది. గ్యాస్‌లైన్ ధర పెరగడం ఓ ఉదాహరణ. ఆహారం, ఇళ్లు, మార్టిగేజెస్, ఇతర ప్రాథమిక సౌకర్యాలపై తీవ్ర ప్రభావం పడింది. మరోవైపు వేతనాల్లో పెరుగుదల లేదు. చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలూ తగ్గిపోయాయి. ప్రత్యేకించి ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోగా.. ఏఐ వృద్ధి ప్రభావం కూడా పడింది.

అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ద్వారా కల్పించిన 'పుట్టుకతోనే పౌరసత్వం' సదుపాయాన్ని రద్దు చేయడానికి ట్రంప్ ప్రయత్నించారు. వలసదారులపై ఐసీఈ ఏజెంట్లు దాడులు చేశారు. తాము ద్వితీయ శ్రేణి పౌరులమన్న అభిప్రాయం వారిలో కలిగేలా చేశారు.

ప్రపంచవ్యాప్తంగా అనవసర యుద్ధాలు చేయబోనని ట్రంప్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ దీనికి భిన్నంగా ఇర్నా తలపెట్టిన యుద్ధం అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణమైంది


విద్యా సంస్థల వ్యవస్థ అమెరికాకున్న అతి పెద్ద ఆస్తుల్లో ఒకటి. ట్రంప్ విధానాల పరంగా దాడిచేసి.. వాటిని విధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. నైపుణ్యం కలిగిన విదేశీ విద్యార్థులు, పరిశోధకులు రాకుండా ఇమిగ్రేషన్ విధానాలను కఠినంగా మార్చారు. ఈ విధానాలు విద్యా సంస్థలను బలహీనపరిచాయి.

ప్రభుత్వంలోని ముఖ్య స్థానాలను ట్రంప్, ఆయన కుటుంబం, సిబ్బంది వినియోగించుకుని తమ సంపాదనను గణనీయంగా పెంచుకున్నారు.

ఈ ఎన్నికల ప్రభావం భారత్పై కూడా ఉండవచ్చు. మొదటిది ఇమిగ్రేషన్ విధానాలు మెరుగైతే భారత విద్యార్థులు (ఎఫ్-1), భారత కార్మికులు (హెచ్1బి) అమెరికాకు గతంలో మాదిరే వచ్చే అవకాశం ఉంటుంది. రెండోది ఇరాన్ యుద్ధం త్వరగా ముగిసి చమురు ధరలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. మూడోది.. భారత విధానకర్తలకు ఇదొక హెచ్చరిక లాంటిది. అసమానతలను పెంచే విధానాలు, మైనార్టీలపై వివక్ష చూపే విధానాలు అనుసరిస్తే.. గట్టి ఎదురుదెబ్బ తగులుతుంది.

ఇరాన్‌కు సాయం..

భారతీయ జంటపై అమెరికా ఆంక్షలు..!



వాషింగ్టన్, నవంబర్ 4 : భారత్‌కు చెందిన వ్యాపారవేత్త, ఆయన భార్యపై అమెరికా ఆంక్షలు విధించింది. వారితో పాటు భారత్, టర్కియేలోని పలు కంపెనీలు, వ్యక్తులను ఈ ఆంక్షల జాబితాలో చేర్చింది. చమురు ఎగుమతుల విషయంలో అంతర్జాతీయ ఆంక్షలను తప్పించడానికి ఇరాన్‌కు సహకరించారన్న ఆరోపణలపై అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. మధ్యంతర ఎన్నికల ఫలితాల అనంతరం అమెరికా ట్రెజరీ విభాగం నుంచి ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం.

ఇరాన్ ఆర్థిక వనరులను పూర్తిగా దెబ్బతీసేందుకు, ఆ దేశాన్ని అంతర్జాతీయంగా ఒంటరిని చేసేందుకు అమెరికా 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట ఆంక్షలు విధిస్తోంది. అలాగే ఇరాన్ ప్రభుత్వానికి సహకరించేవారినీ వదలబోమని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలోనే భారత్‌కు చెందిన సునీల్ కుమార్ శర్మ, ఆయన భార్య జస్ప్రీత్ ప్రీతి షాహిద్‌తో పాటు మరో ఇద్దరు భారతీయులపై ఆంక్షలు విధించింది. అలాగే శర్మకు చెందిన 9 సంస్థలు కూడా ఆంక్షల జాబితాలో ఉన్నాయి. ''ఇరాన్ పెట్రోలియం రవాణాలో భాగమై ఆంక్షలకు గురైన నౌకలకు తప్పుడు గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలను అందించడంలో వారు సహకరించారు. ఇరాన్ సైన్యం, దాని అనుబంధ సంస్థల నౌకలకు కూడా ఈ తరహా సేవలు అందించారు'' అని ట్రెజరీ విభాగం పేర్కొంది.

అలాగే టర్కియేకు చెందిన ఫుగో గ్రౌండ్ సర్వీసెస్ సంస్థ పేరునూ ఈ ఆంక్షల జాబితాలో చేర్చారు. ఇరాన్ విమానయాన రంగానికి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ అగ్రరాజ్యం ఈ చర్యలు తీసుకుంది. ''మీరు మాతో ఉన్నారా? మాకు వ్యతిరేకంగా ఉన్నారా? అనేది మేం తెలుసుకుంటాం. ఇరాన్ పాలనకు మద్దతు ఇచ్చే వారిపై ఆంక్షలు తప్పవు'' అని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మరోసారి హెచ్చరించారు.

ఎన్నికల విధుల్లో ప్రాణాలు కోల్పోయిన టీచర్..

● చంద్రబాబు, పవన్, లోకేష్ సంతాపం

విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతోన్న సమయంలో విషాదం నెలకొంది.. ఎన్నికల విధులు నిర్వహిస్తుండగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన అనంతపురం జిల్లాలో చోటుచేసుకుంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ విధుల్లో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయురాలు హరిత గౌడ్ (58) తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు.

హరిత మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ఎన్నికల విధుల్లో ఉండగా పోలింగ్ అధికారి హరిత గౌడ్ మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. హరిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

హరిత కుటుంబానికి అన్ని ప్రయోజనాలు అందించాలి: పవన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కలాయ్ణ్ సైతం హరిత గౌడ్ మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆమె గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. హరిత ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





నివాళులర్పించిన మంత్రి నారా లోకేష్

మంత్రి నారా లోకేష్ కూడా హరిత గౌడ్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు నిర్వహిస్తూ ఆమె గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినప్పటికీ ఆమెను కాపాడలేకపోవడం విచారకరమన్నారు. హరితకు నివాళులర్పిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయితే, ఎన్నికల విధుల నిర్వహణలో ఉండగానే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

కూలిన మూడంతస్తుల భవనం..

ఇద్దరు మృతి

శిథిలాల కింద చిక్కుకున్న పలువురు



ఢిల్లీ, నవంబర్ 4 : దేశ రాజధాని ఢిల్లీలో మూడంతస్తుల భవనం కూలిపోయింది. ఓల్డ్ ఢిల్లీలోని చాందీ బజార్ మెట్రో స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ఆ భవనం లోపల నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు వెల్లడించారు. ఈ క్రమంలోనే అది కూలినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం ఇరుకైన వీధిలో ఉండటంతో సహాయ చర్యలకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే.. రెండు రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా చాందినీ చౌక్‌లోని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌హాల్లో కొంతభాగం కూలిపోయింది. ఇటీవల ఢిల్లీలోని మిలన్ గార్డెన్ ప్రాంతంలో ఒక పాత ఇంటిపై మరో అంతస్తు నిర్మాణం చేపడుతుండగా భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలోనూ ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. దేశ రాజధానిలో ఈ వరుస ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

కార్నియా శస్త్రచికిత్సల్లో ఆధునిక విధానాలపై

మెడికవర్ ఆస్పత్రిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



హైదరాబాద్,5 నవంబర్, 2026: కార్నియా మార్పిడి, అత్యాధునిక నేత్ర శస్త్రచికిత్స విధానాలపై యువ నేత్ర వైద్యులకు అవగాహనతో పాటు ప్రత్యక్ష శిక్షణ అందించే లక్ష్యంతో హైదరాబాద్ మాదాపూర్లోని మెడికవర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ రోబోటిక్స్ సెంటర్లో అఐఖి ప్రయోగశాల కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలంగాణ ఆప్తాల్మాలజికల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లామెల్లార్ కార్నియల్ సర్జరీ విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

కార్నియా మార్పిడిలో ఉపయోగించే ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులపై ఈ శిక్షణ కార్యక్రమం ప్రధానంగా దృష్టి సారించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 44 మంది రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులతో పాటు మొత్తం 72 మంది ప్రతినిధులు, వైద్య నిపుణులు పాల్గొన్నారు. తెలంగాణతో పాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి నేత్ర వైద్యులు హాజరయ్యారు.

అఐఐఖి న్యూఢిల్లీ, దిశా ఐ హాస్పిటల్ (బారక్పూర్), అపోలో హాస్పిటల్స్ (బెంగళూరు), ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ (హైదరాబాద్) వంటి ప్రముఖ వైద్య సంస్థలకు చెందిన జాతీయ స్థాయి నిపుణులు ఫ్యాకల్టీగా పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎం. సుబ్రమణ్యం, ప్రొఫెసర్ వై. రామన్, డాక్టర్ ఏ.ఆర్. కృష్ణ ప్రసాద్ హాజరై, యువ నేత్ర వైద్యులకు ఇలాంటి ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, కార్నియా అండ్ ఆక్యులర్ సర్ఫేస్ సర్వీసెస్ విభాగానికి చెందిన డాక్టర్ చారుత జె. పురాణిక్ ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ డైరెక్టర్గా వ్యవహరించారు.

ఈ శిక్షణలో భాగంగా నిపుణుల మాస్టర్ క్లాసులు, శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రదర్శనలు, చర్చలు, వెట్ ల్యాబ్లో ప్రాక్టికల్ శిక్షణ నిర్వహించారు. అత్యాధునిక ఆపరేటింగ్ మైక్రోస్కోపులు, ప్రత్యేక మైక్రో సర్జికల్ పరికరాల సహాయంతో పాల్గొన్న వైద్యులకు నిపుణులు వ్యక్తిగతంగా, చిన్న బృందాలుగా మార్గదర్శనం చేశారు. ముఖ్యంగా కార్నియా గ్రాఫ్ట్ తయారీ, కణజాల నిర్వహణ, శస్త్రచికిత్సలో అనుసరించాల్సిన మెళకువలు, సమస్యల నివారణ, శస్త్రచికిత్స సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే విధానాలపై శిక్షణ అందించారు. తద్వారా పుస్తక పరిజ్ఞానాన్ని ఆచరణాత్మక శస్త్రచికిత్స నైపుణ్యాలుగా మార్చుకునే అవకాశం యువ వైద్యులకు లభించింది.

గౌరవ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంతోష్ జి. హోనవర్ ఆలోచన నుంచి రూపుదిద్దుకున్న అఐఖి ప్రయోగశాల కనెక్ట్ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా యువ నేత్ర వైద్యులకు అత్యాధునిక శస్త్రచికిత్స శిక్షణ అందుతోంది.

వైద్య విద్య, ఆధునిక శస్త్రచికిత్స నైపుణ్యాల అభివృద్ధి, వైద్య రంగంలో నిపుణుల మధ్య అకడమిక్ సహకారాన్ని ప్రోత్సహించడంలో మెడికవర్ హాస్పిటల్స్ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఈ కార్యక్రమం ద్వారా హైటెక్ సిటీ మెడికవర్ హాస్పిటల్స్ అధునాతన నేత్ర వైద్యం, శిక్షణ, వైద్య పరిశోధన రంగాల్లో తన పాత్రను మరింత బలోపేతం చేసుకుంది.

తాగునీటి సమస్యలు లేకుండా పకడ్బందీ చర్యలు

- వాటర్ స్ట్రెస్ గ్రామాలను నవంబర్లోనే గుర్తించి సమస్యలు పరిష్కరించాలి
- హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల కు 15 రోజుల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు
- వారం రోజుల్లో గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి
- కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్



సూర్యాపేట, నవంబర్ 5 (మనం ప్రతినిధి): జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి నవంబర్ నెలలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరాతో పాటు నీటి శుద్ధి, క్లోరినేషన్ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలు, ఆవాసాల వారీగా తాగునీటి పరిస్థితిని అంచనా వేసి గ్రీన్, ఎల్లో, రెడ్ కేటగిరీలుగా విభజించాలని తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా వివరాలు సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా వ్యవస్థల ద్వారా నీటి సరఫరా, స్థానిక నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలన్నారు. నీటి సమస్యలు లేని ప్రాంతాలు, కొంత ఇబ్బంది ఉన్న ప్రాంతాలు, తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.

హాస్టళ్లకు 15 రోజుల్లో నీళ్లు...

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు 15 రోజుల్లోగా మిషన్ భగీరథ కనెక్షన్లు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కనెక్షన్లు లేని సంస్థలకు ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా కల్పించాలని, అవసరమైతే సంపులు, సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కూడా తాగునీరు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

నీటి వృథాపై నివేదిక ఇవ్వాలి..

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో సుమారు 20 నుంచి 25 శాతం వరకు వృథా అవుతున్నట్లు తన పరిశీలనలో గుర్తించానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అంచనాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని వారం రోజుల్లో నివేదించాలని అధికారులను కోరారు. ఓవర్హెడ్ ట్యాంకుల నుంచి పైపులైన్ల ద్వారా నీరు వృథాగా డ్రైనేజీల్లోకి వెళ్తున్న ప్రాంతాలను గుర్తించి లీకేజీలను అరికట్టాలన్నారు.

ప్రతి గ్రామంలో ట్యాంకర్ సిద్ధంగా ఉండాలి

అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు ప్రతి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, ట్యాంకర్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పనిచేయని ట్యాంకర్లు, ట్రాక్టర్లను వెంటనే మరమ్మతు చేయించాలని, అవసరమైతే అద్దెకు తీసుకోవడానికి కూడా కారణాలు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

భూగర్భ జలాలపై 15 రోజులకోసారి నివేదిక..

భూగర్భ జలాల పరిస్థితిపై ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవ్వాలని గ్రౌండ్ వాటర్ అధికారులను ఆదేశించారు. నీటి వనరుల లభ్యత, బోర్వెల్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ప్రభుత్వ భవనం వద్ద రూఫ్టాప్ రెయిన్వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, బోర్వెల్లకు రీచార్జ్ నిర్మాణాలు, కమ్యూనిటీ సోక్పిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పాఠశాలలు, అంగన్వాడీలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ పనులు చేపట్టాలన్నారు.మిషన్ భగీరథ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రౌండ్ వాటర్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయాల వల్ల నీటి పంపింగ్ నిలిచిపోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి వారం సమావేశమై సమస్యలు, పరిష్కారాలపై సమీక్షించాలని తెలిపారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, బోర్వెల్ల తవ్వకాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంతాన సమస్యలపై ఆందోళన వద్దు

- ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సూర్యాపేట, నవంబర్ 5 (మనం ప్రతినిధి): సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులు ఆందోళన చెందకుండా ఆధునిక వైద్య విధానాల ద్వారా తగిన చికిత్స పొందాలని కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ విజిత రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీహన్ ఆసుపత్రిలో సంతానం లేని దంపతుల కోసం ఉచిత ఫెర్టిలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంతానలేమి సమస్యకు మహిళలే కారణమనే అపోహ సరైంది కాదని, భార్యాభర్తలు ఇద్దరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంతానలేమికి మహిళల్లోనే కాకుండా పురుషుల్లోనూ వివిధ కారణాలు ఉండవచ్చని తెలిపారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకుంటే సమస్యకు కారణాలను గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. ఆధునిక వైద్యరంగంలో సంతాన సాఫల్యానికి అనేక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సంతాన సమస్యలపై ఎలాంటి సంకోచం, అపోహలు పెట్టుకోకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని కోరారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట పట్టణ ప్రజలు, సంతాన సమస్యలతో బాధపడుతున్న దంపతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శైలజ, సురేష్, స్వప్న, శ్రావ్య, హాస్పటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మనం వార్తా కథనం ఎఫెక్ట్..

తొలగిన ఫ్లెక్సీలు!

''హెచ్చరిక బోర్డులకు విలువేది.. ఫ్లెక్సీలకు అడ్డేది?' కథనంపై స్పందించిన మున్సిపల్ శాఖ

'జనగామ ప్రధాన చౌరస్తాలో ఫ్లెక్సీల తొలగింపు

ప్రజా సమస్యలపై నిరంతర పర్యవేక్షణ

అధికారుల స్పందనకు వేదికగా మనం దినపత్రిక



జనగామ, నవంబర్ 5(మనం ప్రతినిధి): జనగామ జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఫ్లెక్సీల ఏర్పాటు వల్ల వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులపై 'మనం' దినపత్రికలో గురువారం ప్రచురించిన కథనానికి మున్సిపల్ శాఖ స్పందించింది. హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు ఆస్కారం ఉందని కథనం ద్వారా ప్రజల కోరిక మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.వార్త కథనం ప్రచురితమైన నేపథ్యంలో స్పందించిన జనగామ మున్సిపల్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు, సిబ్బంది ప్రధాన చౌరస్తా పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో చౌరస్తా వద్ద ఫ్లెక్సీల అడ్డంకి తొలగింది. ప్రజా సమస్యను గుర్తించి మనం దినపత్రికలో వార్తా కథనం ప్రచురించగా, సంబంధిత శాఖ స్పందించి చర్యలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా పలువురు 'మనం' దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు..

అనంతరంలో చేతి పంపుల పరిశీలన



పెన్ పహాడ్, నవంబర్ 05 (మనం న్యూస్): స్థానిక సర్పంచ్ మామిడిశోభ శ్రీనివాస్, ఉపసర్పంచ్ గజ్జెల శ్రీనివాస్ రెడ్డి తోపాటు 12 మందివార్డు సభ్యులు అధ్వర్యంలో గ్రామ పారిశుధ్య కార్మికులందరికీ గ్రామ పంచాయతీ కార్యదర్శి సోమయ్య పర్యవేక్షణలో గ్రామంలో నడవని చేతి పంపులు పరిశీలించి రిపేరు చేయించి శుక్రవారం దెబ్బ తిన్న పైపులు, బోరింగుల, మేటిరియల్ తెచ్చి రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో ప్రజలకు చేతి పంపులు అందుబాటులోకి వస్తాయని సర్పంచ్ శోభ శ్రీనివాస్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి సోయయ్య తెలిపారు బోరింగ్ మేకానిక్ మౌలానా రిపేరు చేస్తున్నారని అన్నారు. వీరందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎల్ఎనినో ప్రభావంపై అవగాహన..

- నీరు, విద్యుత్ పొదుపుపై మైనంపల్లి కొర్రతాండ ప్రజల ప్రతిజ్ఞ



దేవరకొండ, నవంబర్ 5 (మనం న్యూస్): ఎల్ఎనినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో మైనంపల్లి కొర్రతాండలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీరు, విద్యుత్ను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. ఇంటి అవసరాల్లోనూ, వ్యవసాయ పనుల్లోనూ నీటి పొదుపు పద్ధతులను పాటించాలని కోరారు. అలాగే విద్యుత్ను కూడా అనవసరంగా వినియోగించకుండా, అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆపివేయాలని సూచించారు. గ్రామంలోని బావులు, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నీటి సంరక్షణపై పిల్లలు, యువత, మహిళలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటి నుంచి పొదుపు చర్యలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థులతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. నీటిని వృథా చేయకుండా వినియోగించడం, విద్యుత్ను పొదుపుగా ఉపయోగించడం, నీటి వనరులను కాపాడుకోవడం, ఇతరులకు కూడా అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కొర్ర లక్ష్మీ ప్రశాంత్. సునీత బద్రు.కొర్ర కిషన్. మాజీ సర్పంచులు కొర్ర పాండు. కొర్ర అంత్య నాయక్. గ్రామస్థులు.గ్రామ పెద్దలు శ్రీకాంత్. కెస్య. జగన్. జబ్బార్ లాల్. దీప్ల.పాండు. దకన. సూర్య.శ్రీను.నరేష్. మాన్సింగ్. తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఎల్ఎనినో ప్రభావం, నీటి కొరతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు.

రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలి



దేవరకొండ, నవంబర్ 5 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 100 పాయింట్ల రోస్టర్ విధానంలో ఎస్సీ గ్రూప్-3 (మాల, మాల అనుబంధ కులాలు)కు 22వ రోస్టర్ పాయింట్ కేటాయించడం తీవ్ర అన్యాయమని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కేటగిరీలకు మొదటి 20 రోస్టర్ పాయింట్లలోనే అవకాశాలు కల్పించి, మాలలకు మాత్రం 22వ స్థానం కేటాయించడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో రోస్టర్ విధానంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం ఎస్సీ గ్రూప్-3 పరిధిలోని మాల, మాల అనుబంధ 26 కులాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు వివిధ రంగాల్లో నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల పదోన్నతుల విషయంలో తగిన అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు.


మొదటి 20 స్థానాల్లో మాలలకు ఎందుకు చోటు లేదు?

100 పాయింట్ల రోస్టర్ విధానంలో మొదటి 22 పాయింట్లను పరిశీలిస్తే ఓసీ కేటగిరీకి 1, 3, 5, 11, 12, 13, 21 పాయింట్లు, ఈడబ్ల్యూఎస్కు 9, 17, ఎస్టీకి 8, 15, బీసీ-ఏకు 4, 20, బీసీ-బీకి 10, బీసీ-సీకి 14, బీసీ-డీకి 18, బీసీ-ఈకి 19 పాయింట్లు కేటాయించారని వివరించారు. ఎస్సీ గ్రూప్-1కు 7వ పాయింట్, ఎస్సీ గ్రూప్-2కు 2, 16 పాయింట్లు కేటాయించగా, ఎస్సీ గ్రూప్-3కు మాత్రం 22వ రోస్టర్ పాయింట్ మాత్రమే కేటాయించారని తెలిపారు. మిగతా కేటగిరీలకు 20 పాయింట్ల లోపే అవకాశాలు కల్పించినప్పుడు మాల, మాల అనుబంధ కులాలకు మాత్రం 22వ పాయింట్ ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. ఈ విధానం వల్ల భవిష్యత్తులో విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ గ్రూప్-3 వర్గాలకు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

18 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

దేవరకొండ బస్టాండ్ వద్ద నిరాహార దీక్షకు కేతావత్ భీల్యా నాయక్ సంఘీభావం



దేవరకొండ, నవంబర్ 5 (మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18 వేల మంది ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ డిమాండ్ చేశారు. బకాయిల విడుదల కోరుతూ దేవరకొండ పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భీల్యా నాయక్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఆర్టీసీ కార్మికులకు అన్ని విధాలా అండగా నిలిచి, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. దశాబ్దాల పాటు ఆర్టీసీ సంస్థకు సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల కోసం రోడ్డెక్కి నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. కనీసం పదవీ విరమణ ప్రయోజనాలు, పెండింగ్ బకాయిలు కూడా విడుదల చేయకుండా రిటైర్డ్ ఉద్యోగులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 18 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, ఆర్టీసీ కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల నుంచే ప్రారంభమవుతుందని భీల్యా నాయక్ వ్యాఖ్యానించారు. రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

మహిళా కౌన్సిలర్ల పరువుకు భంగం కలిగిస్తే సహించం



- మున్సిపల్ కమిషనర్కు వినతి పత్రం అందజేత

హుజూర్ నగర్, నవంబర్ 05 (మనం న్యూస్) మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ పులిచింతల వెంకట్ రెడ్డి తమపై చేసినవి నిరాధారమైన ఆరోపణలని, వాటిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పట్టణ మహిళా కౌన్సిలర్లు కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈనెల 4న కౌన్సిలర్ వెంకట్ రెడ్డి కమిషనర్కు ఇచ్చిన లేఖలో, అధికారిక కార్యక్రమాలు చర్చలలో మహిళా కౌన్సిలర్లకు బదులుగా వారి భర్తలు పాల్గొంటున్నారని ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. కౌన్సిలర్ల ముఖ్య డిమాండ్లు అంశాలు ఏ రోజూ కూడా అధికారిక కౌన్సిల్ సమావేశాలలో కౌన్సిలర్లు తప్ప వేరే ఇతర వ్యక్తులు గానీ, కుటుంబ సభ్యులు గానీ పాల్గొనలేదని స్పష్టం చేశారు.దురుద్దేశంతో తమ కుటుంబ సభ్యుల పరువుకు భంగం కలిగించేలా వెంకట్ రెడ్డి ఈ ఫిర్యాదు చేశారని, ఇటువంటి చర్యలు ముమ్మాటికీ సహించరానివని పేర్కొన్నారు. ఒకవేళ అధికారిక సమావేశాల్లో కుటుంబ సభ్యులు పాల్గొన్నారన్న వాదనలో నిజముంటే వారిని మీటింగ్ రూమ్లోకి ఏప్రాతిపదికనఅనుమతించారో చైర్మన్, కమిషనర్లు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులుగా పనిచేస్తున్న తమ పదవులకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదుపై తక్షణమే విచారణ జరిపి, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై తగినచర్యలుతీసుకోవాలని మహిళా కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

మహిళ మృతి ఆసుపత్రి ఎదుట ధర్నా

- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



గజ్వేల్ నవంబర్ 5 మనం న్యూస్.గజ్వేల్ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వర్గల్ మండల కేంద్రానికి చెందిన పశువుల కవిత డెలివరీ నిమిత్తం గజ్వేల్ లోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చేరడం జరిగింది. అనంతరం కవితకు ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ కు తరలించగా అక్కడ మృతి చెందడంతో మృతురాలి బంధువులు ఆ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. వివరాల్లోకి వెళితే గతవారం క్రితం కాన్పుకై ఆపరేషన్ నిర్వహించగా ఆపరేషన్ లో మూత్ర నాళాలకు సంబంధించిన సమస్య తలెత్తడంతో ఆ సమస్య పరిష్కారానికి హైదరాబాదులోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్సకు పంపించడం జరిగిందని మృతురాలి బంధువులు తెలిపారు. కవిత చెందడంతో బంధువులు భారీ సంఖ్యలో గజ్వేల్ పట్టణానికి చేరుకొని ఆసుపత్రి వద్ద కవిత శవాన్ని ఉంచి తనను నిర్వహించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ భారీ సంఖ్యలో మృతురాలి కుటుంబ సభ్యులు అక్కడికి రాగా వారిని పూర్తిస్థాయిలో సముదాయించినప్పటికీ కూడా తలవకపోవడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసులను సంఘటన స్థలానికి రప్పించడం జరిగింది. అంతకుముందు మృతురాలి బంధువులు కుటుంబ సభ్యులు రోడ్డుపైన ధర్నా నిర్వహించారు. అయినప్పటికీ శాంతించని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఆస్పత్రి ముందట రాత్రి వరకు కూడా ధర్నా నిర్వహిస్తూనే ఉండడం జరిగింది.

నల్గొండ జిల్లాలో రెచ్చిపోతున్న కెమికల్ మాఫియా

- అప్పుడు జాతీయ రహదారి వెంట చెరువులు..
- కుంటలు నుంచి ఇప్పుడు నాగార్జునసాగర్ లోలెవల్ కాలువ వరకు వ్యర్థ రసాయనాల పారబోత
- పట్టించుకోని జిల్లా పొల్యూషన్ బోర్డు అధికారి



నల్గొండ, నవంబర్ 5(మనం ప్రతినిధి): నల్గొండ జిల్లాలో ప్రమాదకర వ్యర్థ రసాయనాల అక్రమ పారబోత మరోసారి వెలుగులోకి వచ్చింది. పెద్దవూర మండలం చింతపల్లి సమీపంలోని నాగార్జునసాగర్ లోలెవల్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్ ద్వారా వ్యర్థ రసాయనాలను పారబోసిన ఘటన కలకలం రేపింది. స్థానికుల ఆరోపణల ప్రకారం, గతంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న చెరువులు, కుంటల్లో వ్యర్థ రసాయనాలను పారబోసిన మాఫియా, ఇప్పుడు ఏకంగా నాగార్జునసాగర్ లోలెవల్ కాలువను లక్ష్యంగా చేసుకుందని చెబుతున్నారు. కంపెనీల నుంచి బయలుదేరే వ్యర్థ రసాయనాల ట్యాంకర్లను ట్రీట్మెంట్ ప్లాంట్ల వరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సమర్థంగా ట్రాక్ చేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై ఇరిగేషన్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు. కాలువలో వ్యర్థ రసాయనాలు పారబోసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ పారబోతలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోని జిల్లా పొల్యూషన్ బోర్డు అధికారి వెంకన్న: జి జనార్దన్ రెడ్డి పర్యావరణవేత్త



ఉమ్మడి నల్గొండ జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు టాస్క్ఫోర్స్ కమిటీ పనిచేయడం లేదు. టాస్క్ఫోర్స్ కమిటీపై రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి పూర్తి విచారణ చేయాలని ఫిర్యాదు చేయుచున్నాను. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ వెంకన్న పూర్తిగా ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించాలని తెలియజేయుచున్నాను. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతి ఫార్మా కంపెనీలో ఎఫ్లుయెంట్ ట్యాంకర్లు కంపెనీలో ఉంటున్నాయి. మొన్న జరిగిన దసరా పండుగ రోజు మల్కాపూర్ నుండి విజయవాడ హైవే పై అనేక లారీల ఎఫ్లుయెంట్ పారబోసినారు. ఇంతవరకు నల్గొండ జిల్లా ఉమ్మడి ఈ ఎలాంటి చర్య తీసుకోలేదు.

పుష్కర ఘాట్ల మరమ్మతులు, నూతన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఘాట్లకు అనుసంధాన రహదారులు.. అవసరమైన భూసేకరణపై దృష్టి సారించాలి
- భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యమివ్వాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు,నవంబర్ 5,మనం ప్రతినిధి: గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా జిల్లాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్లను సంసిద్ధం చేసేందుకు అవసరమైన మరమ్మతులు, నూతన పనుల ప్రతిపాదనల రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా లతో కలిసి గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టైర్-1, టైర్-2, టైర్-3 ప్రాతిపదికన మంగపేట, చుంచుపల్లి, రామన్నగూడెం పుష్కర ఘాట్లను సంసిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా ఘాట్ల వద్ద ప్రస్తుతం ఉన్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, అదనపు నిర్మాణాలు, నూతన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వరకు భక్తులు సులభంగా చేరుకునేందుకు అనుసంధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. రహదారులకు అవసరమైన భూసేకరణ, భూముల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఘాట్ల వద్ద స్వచ్ఛమైన తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు, విద్యుత్ దీపాలు తదితర సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వ్యర్థాల సేకరణ, తరలింపునకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా, పార్కింగ్ ఏర్పాట్లపై సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్కు అనువైన స్థలాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. ఘాట్ల వద్ద వైద్య శిబిరాలు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా వైద్యారోగ్య శాఖ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తమ పరిధిలో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి



ఏటూర్ నాగారం, నవంబర్ 5,మనం ప్రతినిధి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబరు 6వ తేదీతో గడువు ముగియనున్నందున అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, ఆర్టీఏ రాష్ట్ర డైరెక్టర్ వసంత శ్రీనివాస్ కోరారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2023 డిసెంబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తమ సెల్ఫోన్ల ద్వారా లేదా ఆన్లైన్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబరు 6వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు కావడంతో అర్హులెవరూ అవకాశాన్ని కోల్పోవద్దన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసిన అనంతరం ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోతో పాటు సంబంధిత పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి ధ్రువీకరణ (అప్రూవల్) పొందాలని తెలిపారు.

పట్టభద్రులందరూ ఈ విషయాన్ని గమనించి గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూత్ టౌన్ అధ్యక్షుడు బండారి లక్ష్మీ, ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు, భరత్, సద్దాం హుస్సేన్, శ్రావణ్కుమార్, తొగరి రవి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించాలి



- నూతన ఎస్సై మధుకర్కు బీజేపీ నాయకుల సన్మానం

మంగపేట, నవంబర్ 5,మనం ప్రతినిధి: మంగపేట పోలీస్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మధుకర్ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు రావుల జానకిరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎస్ఐను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు.

నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం వీరన్నుమార్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల మధుసూదన్ పటేల్, నాయకులు రామటెంకి సమ్మయ్య, బొల్లికొండ సాంబయ్య, నిడదవోలు శ్రీనివాస్, బడే జగన్మోహన్, కాసార్ల మల్లారెడ్డి, ఎంబడి నవీన్, ఏల్లెబోయిన నరేష్, ములి భీమారావు, తోలెం శంకర్, సీహెచ్ భాస్కర్, ఒర్రె రామకృష్ణ, ఏ. మధు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎస్హెచ్ఓకు స్వాగతం

మంగపేట, నవంబర్ 5, మనం ప్రతినిధి: మంగపేట పోలీస్టేషన్ నూతన ఎస్హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన మధుకర్ను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ములుగు ఎస్పీకి బదిలీ అంiన ఎస్సై టీవీఆర్ సూరిని సైతం సోమయ్య కలిసి శాలువాతో సత్కరించారు. మంగపేట మండలంలో స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజల మన్ననలు పొందారని, విధి నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామ్రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యోరి యణయ్య, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ గంగినేని శేషగిరి, తుడి భగవాన్రెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

దండిగా 'ఆర్ఆర్ ట్యాక్స్' వారిపై చర్యలేవి?

- విమర్శలు కాదు?... వారిపై కేంద్రం చర్యలేవి?
- మోడీ, అమిత్షాకు బీఆర్ఎస్ ప్రశ్నల వర్షం
- బీజేపీ-కాంగ్రెస్ నడుమ భారీ ఒప్పందం ఉంది?:



హైదరాబాద్, నవంబర్ 5, మనం ప్రతినిధి : తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు తాజాగా కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్లో ఏ బిల్డర్ను, డెవలపర్ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.

ఇక, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోడీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్కు తరచూ వస్తున్న మోడీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్



- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

విజయవాడ,నవంబర్,5,(మనం ప్రతినిధి):ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు గురువారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైల్వే వాగన్ వర్క్షాప్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం, విజయవాడ రూరల్ మండలం పాతపాడులోని పోలింగ్ కేంద్రం, గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, పోలింగ్ నిర్వహణ తీరు, భద్రతా ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లతో కూడా మాట్లాడి పోలింగ్ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని ఓటర్లు, పోలింగ్ సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్ల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టిందని, అన్ని రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను చక్కగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని ఆశిస్తున్నామని, అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్లకు తరలిస్తామని తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని లాంఛనాలు పూర్తి చేసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరుస్తామని పేర్కొన్నారు. తాను సందర్శించిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా ఏర్పాటు చేసినట్లు, స్ట్రాంగ్ రూమ్లలో కూడా నిరంతర సీసీటీవీ పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వివరించారు. కృష్ణా జిల్లా ఎన్నికల అబ్జర్వర్ వి. అభిషేక్ తో కూడా ఎన్నికల సరళి గురించి మాట్లాడారు.. పోలింగ్ ముగియడానికి ఇంకా సమయం ఉన్నందున ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ విజ్ఞప్తి చేశారు.

వీబీ-జి రామ్ జి పథకం ద్వారా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి

- మురసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు,
- రహదారులు, విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలి
- రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 5 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వీబీ- జి రామ్ జి పథకం ద్వారా తాత్కాలిక పనులకు బదులుగా ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రానికి మోడల్గా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మురసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని, రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్తో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. వీబీ- జి రామ్ జి పథకం కింద ప్రస్తుతం అందుబాటులో ఉన్న 375 రకాల పనులను సద్వినియోగం చేసుకొని శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి తెలిపారు. చెరువులు, పంట కాలువల పూడికతీత, చెరువుకట్టల పటిష్టత, గ్రామీణ అంతర్గత రహదారులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గాలు, పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, పాఠశాల అదనపు తరగతి గదులు, అసంపూర్తి భవన నిర్మాణాలను ఈ పథకం కింద ప్రతిపాదించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ప్రయోజనం కలిగించే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్బీ, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన అర్హమైన పనులను కూడా వీబి - జి రామ్ జి పథకం కింద ప్రతిపాదించాలని మంత్రి సూచించారు. రహదారుల మరమ్మతులు, మెటలింగ్, కల్వర్టులు, వంతెనలు, కాలువల పునరుద్ధరణ, అసంపూర్తి పనులను గుర్తించి కలెక్టర్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. పనుల మంజూరు కోసం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మురసు తుపాను కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంటలు, రహదారులు, కల్వర్టులు, వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంట నష్టాలను నిబంధనల ప్రకారం నమోదు చేయడంతో పాటు దెబ్బతిన్న మౌలిక సదుపాయాలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు.

ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో వర్షాల ప్రభావం అధికంగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని, అవసరమైన చోట గేబియన్ నిర్మాణాలు చేపట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 56 ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, ఇతర నిర్మాణాల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భద్రాచలం-వెంకటాపురం రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని, టెండర్ ప్రక్రియ పూర్తయినందున వెంటనే జీఎస్టీ పనులు ప్రారంభించాలని మంత్రి సూచించారు. ఇసుక రవాణా కారణంగా రహదారి దెబ్బతినకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో చిన్నపాటి నష్టాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి, మంజూరైన పనులను వాతావరణం అనుకూలించిన వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మల్లెపువ్వుల వాగు పరిధిలోని ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపను తొలగించి, పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వాగు బ్రిడ్జి ప్రారంభ ప్రాంతం నుంచి బ్రిడ్జి వరకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి నీటి నిల్వకు అనుకూలంగా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రతి పంట కాలంలో తాత్కాలిక పనులు చేపట్టి తొలగించే పరిస్థితి లేకుండా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు.

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు అభివృద్ధి పనుల కోసం విడుదలైన రూ.70 లక్షలతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన డీపీసీ, నాన్-జీవో పనులతో పాటు పెండింగ్ పునరుద్ధరణ పనులను కూడా ప్రతిపాదనల్లో చేర్చాలని సూచించారు. గంగారం ప్రాంతంలోని నీటి వనరులు, కాలువల అభివృద్ధి, అవసరమైన చోట చెక్డ్యామ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. గ్రామాల్లో గతంలో ఉన్న వ్యక్తిగత తాగునీటి పథకాలు, బోర్వెల్లు, మోటార్లు, పంపింగ్ వ్యవస్థలను పరిశీలించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునేలా పాత నీటి వనరులను సిద్ధంగా ఉంచాలన్నారు. అశ్వారావుపేట, పెద్దవాగు, అంకమ్మ చెరువు ప్రాంతాల్లో తాగునీటి పథకాల పనితీరును పరిశీలించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం 36 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుక బస్తాలతో చేపట్టిన రక్షణ ఏర్పాట్లను పరిస్థితులకు అనుగుణంగా కొనసాగించాలని మంత్రి సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన రెండు వరుసలకు అదనంగా అవసరమైతే ఐదు వరుసల వరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. యాతాల కుంట టన్నెల్ లైనింగ్ పనులు మరో వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నందున ట్రయల్ రన్కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటి విడుదలకు అనుకూలమైన సమయంలోనే చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో తాగునీటి అవసరాల కోసం ఒక టీఎంసీ నీటిని నిల్వ ఉంచాలని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో రానున్న జనవరి నుంచి కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని తాగునీరు, వ్యవసాయ రంగాలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. గత సంవత్సరాల వర్షపాతం, సెంట్రల్ వాటర్ కమిషన్ సమాచారం ఆధారంగా పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని, వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అన్నారు . ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో ఆయిల్పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నందున మొక్కల సరఫరా, సాగు విస్తరణకు ఉద్యానవన శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి, మెట్ట పంటలతో పాటు జనుము, పిల్లిపెసర వంటి పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.

జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూమి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రాజెక్టు తదుపరి చర్యల కోసం ఢిల్లీలోని సంబంధిత శాఖలతో సంప్రదింపులు కొనసాగించాలని తెలిపారు. కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం, జూలూరుపాడు పట్టణాల్లో ప్రధాన రహదారుల మధ్య డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని మంత్రి సూచించారు. జిల్లాలోని పట్టణాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా, సుందరంగా కనిపించేలా మొక్కలు నాటి వాటిని నిరంతరం సంరక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పనుల నాణ్యత, మన్నికకు ప్రాధాన్యతనిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డిసిహెచ్ఓ రవిబాబు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్కేలోకి లివింగ్ స్టోన్.. హైదరాబాద్‌కు ఆ ఇద్దరు..

ఐపీఎల్ 2027 సీజన్ కు ముందు చెన్నై సూపర్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య నలుగురు ఆటగాళ్ల మార్పిడికి ట్రేడ్ కుదిరింది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్, ఆస్ట్రేలియా ఆటగాడు జాక్ ఎడ్వరడ్స్ హైదరాబాద్ నుంచి చెన్నై జట్టులోకి వెళ్లనున్నారు. బదులుగా సీఎస్కే నుంచి ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్‌ను సన్ రైజర్స్ తీసుకుంది. ఈ బదిలీని ఐపీఎల్ అధికారికంగా ప్రకటించింది. భారత ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్ల ధరతో హైదరాబాద్ జట్టులోకి వచ్చాడు. గతంలో 2018 నుంచి 2021 వరకు ఈ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహించిన అతడు.. ఇప్పుడు మరోసారి ఎస్ఆర్‌హెచ్ లో భాగమయ్యాడు. 2025 ఐపీఎల్ లో చెన్నై తరపున 14 మ్యాచ్ లు ఆడిన ఖలీల్ 15 వికెట్లు పడగొట్టాడు. అయితే 2026 సీజన్ లో ఐదు మ్యాచ్ లు ఆడిన అనంతరం గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లిస్‌ను రూ.2 కోట్లతో హైదరాబాద్ తీసుకుంది. కాగా.. గత వేలంలో లివింగ్‌స్టోన్ ను రూ.13 కోట్లకు హైదరాబాద్ తీసుకోగా.. ఇప్పుడు రూ.6 కోట్లకే చెన్నై ట్రేడ్ చేసుకోవడం గమనార్హం. జాక్ ఎడ్వరడ్స్ రూ.3 కోట్ల ధరతో సీఎస్కే శిబిరంలో చేరనున్నాడు.






'దొంగ నా కొడుకు' చూసి నవ్వుకుంటూ బయటికి వస్తారు: సుష్మితా శెట్టి

''దొంగ నా కొడుకు' సినిమా వినోదాత్మకంగా రూపొందింది. ఇందులో ఫ్రెష్ కామెడీ ఉంటుంది. ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే ఫన్ ఎంటర్ టైనర్ ఇది. మా మూవీ చూసిన ప్రేక్షకులు థియేటర్ నుంచి నవ్వుకుంటూ బయటకి వస్తారు'' అని హీరోయిన్ సుష్మితా శెట్టి తెలిపారు. 'లిటిల్ హార్ట్స్' మూవీ ఫేమ్ మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటించిన చిత్రం 'దొంగ నా కొడుకు'. శ్రీను కంబాల దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది.

ఈ సందర్భంగా సుష్మితా శెట్టి విలేకరులతో మాట్లాడుతూ- ''జగమే సంగీతం' అనే వెబ్ సిరీస్ చేశాను. లీడ్ హీరోయిన్ గా 'దొంగ నా కొడుకు' నా మొదటి సినిమా. ఇందులో చాలా క్యూట్ అండ్ బబ్లీ క్యారెక్టర్ చేశాను. నా రోల్ లో ఇన్నోసెంట్ కామెడీ ఉంటుంది. నేను ఏదైనా స్మార్ట్ గా చేయాలనుకుంటే అది కామెడీగా మారుతుంది.

బిగ్ స్క్రీన్ పై నన్ను నేను చూసుకోవడానికి ఆత్రుతగా ఉన్నాను. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. టాలీవుడ్ లో డ్యాన్సింగ్ హీరోల్లో అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్ గార్లు అంటే ఇష్టం. 'మహానటి' సినిమా నా ఫేవరెట్. అలాంటి అన్ని భావోద్వేగాలున్న సినిమా చేయాలని ఉంది. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు చేస్తున్నాను'' అన్నారు.



రామాయణ..

ప్రతి సీనూ ఆస్వాదించా: రాజమౌళి ప్రశంసలు

అత్యధిక బడ్జెట్తో తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' భారీ అంచనాల మధ్య నేడు (నవంబరు 5) విడుదలైంది. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సినిమాను ఆవిష్కరించిన తీరును కొనియాడుతూ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు.

''రామాయణ' చిత్రంలోని అత్యున్నత హంగులు, వెండితెరపై ఆవిష్కరించిన అద్భుతమైన విజువల్స్ కనువిందు చేస్తున్నాయి. రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటన ఆకట్టుకుంది. ముఖ్యంగా వనవాస ఘట్టం నుంచి అతడి అభినయం ఎంతో ప్రశాంతంగా కనిపిస్తూనే, ప్రతి ఒక్కరినీ కట్టిపడేసింది. రావణుడిగా యశ్ ఆద్యంతం భయపెట్టారు. సీతగా సాయిపల్లవి హుందాగా కనిపించారు. పతాక సన్నివేశాలతో పాటు అంతకు ముందు వచ్చే ఘట్టాలైతే అత్యద్భుతం. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఆస్వాదించాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ విజన్ ను తెరపై ఇంత అందంగా ఆవిష్కరించినందుకు నిర్మాత నమిత్ మల్హోత్ర, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి హృదయపూర్వక అభినందనలు'' అని రాజమౌళి ప్రశంసించారు.



రిటైర్మెంట్ ప్రకటించిన రొనాల్డో

పోర్చుగల్ ఫుట్ బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రిటైర్మెంట్ ప్రకటించాడు. గత నెలలో నేషన్స్ లీగ్ మ్యాచ్ లో కోచ్ జార్జ్ జీసస్.. రొనాల్డోను ఆడించకపోవడంతో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఈ స్టార్ ప్లేయర్ జట్టు శిబిరం నుంచి బయటకు వచ్చాడు. ఇది జరిగిన కొన్ని రోజులకే అతడు రిటైర్మెంట్ ప్రకటన చేయడం గమనార్హం. 41 ఏళ్ల రొనాల్డో పోర్చుగల్ తరపున 234 మ్యాచ్లు ఆడి 146 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్ బాల్ లో అత్యధిక గోల్స్ కొట్టిన ఘనత అతడిదే. వ్యక్తిగతంగా ఎంత సాధించినా.. తన జట్టును ప్రపంచకప్ లో విజేతగా నిలిపి, ట్రోఫీని చేతిలోకి తీసుకుంటేనే ఏ ఆటగాడి కెరీర్ అయినా పరిపూర్ణం అవుతుంది. రొనాల్డోకు మాత్రం ఈ టైటిల్ అందని ద్రాక్ష అయింది. అంతర్జాతీయ కెరీర్కు వీడ్కోలు పలికినా కొన్నేళ్లు క్లబ్ ఆటగాడిగా అలరించనున్నాడు.

''పోర్చుగీస్ ప్రజలారా, మన జాతీయ జట్టుకు చెందిన 7వ నంబర్ జెర్సీని తిరిగి ఇచ్చే సమయం వచ్చేసింది. ఈ జెర్సీ నా ఒక్కడిదే అని ఎప్పుడూ అనుకోలేదు. కానీ 23 సంవత్సరాలుగా దానిని ధరించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టేడియాలకు నాతో పాటు తీసుకువెళ్లే అదృష్టం, బాధ్యత నాకు దక్కింది. నేడు దీనిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది అంత సులభమైన నిర్ణయం కాదు.

ఎందుకంటే కొన్ని నిర్ణయాలను కేవలం బుద్ధితో మాత్రమే తీసుకోలేం, వాటి వెనుక హృదయ స్పందన కూడా ఉంటుంది. 2003 ఆగస్టులో మొదలై, నా జీవితాన్ని పూర్తిగా మార్చివేసిన ఒక ప్రయాణం నేటితో ముగిసింది'' అని రొనాల్డో తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.

- రొనాల్డోను 3 యూఈఎఫ్ఏ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు, 4 యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలు వరించాయి. ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు.
- రొనాల్డో జట్టులోకి వచ్చాక ప్రపంచకప్లో పోర్చుగల్ అత్యుత్తమ ప్రదర్శన సెమీఫైనల్. అది క్రిస్టియానో అరంగేట్రం చేసిన 2006 టోర్నీనే కావడం విశేషం.

ఉత్కంఠ పోరులో పాక్‌పై

భారత్ విజయం

దక్షిణ ఆసియా ఫుట్ బాల్ సమాఖ్య ఛాంపియన్ షిప్స్ 2026లో భారత ఫుట్ బాల్ జట్టు అదరగొట్టింది. ఆరంభ మ్యాచ్ లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై 3-2 తేడాతో విజయం సాధించింది. ఆఖర్లో పాక్ రెండు గోల్స్ చేసినప్పటికీ భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ దూకుడుగా ఆడింది. 13వ నిమిషంలో సుహైల్ అహ్మద్ భట్ తొలి గోల్ సాధించాడు. ఆ తర్వాత 19వ నిమిషంలో మరోసారి గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. 32వ నిమిషంలో మాంగ్లెంతాంగ్ కిప్ గెన్ మూడో గోల్ సాధించాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసమయానికి భారత్ 3-0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే చివరి నిమిషాల్లో పాకిస్థాన్ పుంజుకుంది. 90+1వ నిమిషంలో నజీబ్ గోల్ చేయగా.. 90+4వ నిమిషంలో ఘాజీ మరో గోల్ సాధించాడు. దీంతో మ్యాచ్ లో ఉత్కంఠ నెలకొంది. చివరకు భారత్ 3-2తో గెలుపొందింది.





యూత్ ఒలింపిక్స్.. ఫైనల్లో తన్వి పాత్రి

యూత్ ఒలింపిక్స్ లో భారత అమ్మాయి తన్వి పాత్రి చరిత్ర సృష్టించింది. ఈ క్రీడల్లో మహిళల సింగిల్స్ బ్యాడ్మింటన్ లో ఫైనల్ చేరిన భారత తొలి క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. ఆమె బుధవారం హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో 21-14, 11-21, 21-19తో యుజునో వతానబె (జపాన్)ను ఓడించి, తుది పోరుకు అర్హత సాధించింది. తొలి గేమ్ను సులువుగానే గెలుచుకున్న తన్వి.. రెండో గేమ్లో తేలిపోయింది. నిర్ణయాత్మక మూడో గేమ్లో పట్టువదలని తన్వి విజయం సాధించి ఫైనల్ చేరింది. గురువారం ఆమె పసిడి కోసం పోరాడనుంది. తన్వి కంటే ముందు భారత్ నుంచి యూత్ ఒలింపిక్స్లో ముగ్గురు సెమీస్ చేరారు. వారిలో ప్రణయ్ (2010లో), లక్ష్య (2018లో) రజతాలు చేజిక్కించుకోగా.. ఆదిత్య పతకం అందుకోలేకపోయాడు.

చరణ్, సుకుమార్ ప్రాజెక్ట్ షూట్ ఇంత లేట్ గానా?



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తన బ్లాక్ బస్టర్ హిట్ దర్శకుడు సుకుమార్ కలయికలో అవైటెడ్ సినిమాని మేకర్స్ రీసెంట్ గానే అనౌన్స్ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. చరణ్ కెరీర్ 17వ సినిమాగా అట్టహాసంగా ముహూర్త కార్యక్రమాలతో సినిమా మొదలైంది. అయితే ఈ సినిమాకి పూర్తి స్థాయి నటీనటులు ఇంకా ఫైనల్ కాలేదు. దీనితో షూటింగ్ మాత్రం కాస్త ఆలస్యంగానే మొదలవుతుంది అని వినిపిస్తోంది.

లేటెస్ట్ రూమర్స్ ప్రకారం ఈ సినిమా వచ్చే ఏడాదిలోనే పట్టాలెక్కుతుంది అని వినిపిస్తోంది. ఈలోపు నటీనటులు ఎంపిక పూర్తిస్థాయిలో జరగనుంది అని టాక్. సో దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి సంగీత దర్శకుడు కూడా ఫైనల్ కావాల్సి ఉండగా మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాని భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్నారు.

తెలుగు నటిగా గర్విస్తున్నా: పాయల్ రాజ్‌పుత్

టాలీవుడ్ హాట్ బ్యూటీ పాయల్ రాజ్ పుత్ తెలుగు,తమిళ, హిందీ, పంజాబీ ఇండస్ట్రీలో పలు చిత్రాల్లో నటించి విపరీతమైన క్రేజ్ రాబట్టుకుంది. తెలుగులో ఆర్ఎక్స్-100, మంగళవారం వంటి సెన్సేషనల్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్న ఈ భామ.. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. షూటింగ్ లతో బిజీగా ఉన్నప్పటికీ పలు విషయాలపై రియాక్ట్ అవుతోంది. తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసుకున్న పాయల్ రాజ్ పుత్. తాజాగా, పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. తెలుగు నటిగా తాను ఎంతో గర్విస్తున్నానని స్పష్టం చేసింది. మనకు పేరు ప్రఖ్యాతలు, గుర్తింపు ఇచ్చిన పరిశ్రమ నుంచి ప్రతి ఒక్కటి పొందిన తర్వాత, ఇన్నాళ్లకు వచ్చి మొత్తం తెలుగు వ్యవస్థనే నిందించడం అనేది కేవలం అసంబద్ధమైన ద్వేషం తప్ప మరొకటి కాదని తేల్చి చెప్పింది. టాలీవుడ్ తనను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని, తన ఎదుగుదలకు అండగా నిలిచిన ఈ పరిశ్రమకు తాను ఎప్పటికీ అండగానే ఉంటానని పాయల్ పేర్కొంది.



డీప్‌ఫేక్‌లపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు!

స్టార్ నటి కృతి సనన్కు ఢిల్లీ హైకోర్టులో కీలక ఊరట లభించింది. ఆమె పేరు, ఫొటోలు, గొంతు, వ్యక్తిగత గుర్తింపును అనుమతి లేకుండా ఉపయోగించరాదని ఆదేశించింది. అలా రూపొందిస్తున్న ఏఐ డీప్ ఫేక్ వీడియోలు, అభ్యంతరకర చిత్రాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలపై న్యాయస్థానం ఈమేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి కంటెంట్ను తొలగించాలని సంబంధిత ఆన్ లైన్ ప్లాట్ ఫామ్ లను ఆదేశించింది.

కృతి సనన్ దాఖలు చేసిన పర్సనాలిటీ రైట్స్ పిటిషన్ను విచారించిన జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ అక్టోబర్ 29 న ఈ ఆదేశాలు ఇచ్చారు. నవంబర్ 4 న ఈ తీర్పు వివరాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు వ్యక్తులు, సంస్థలు తన గుర్తింపును వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని గతంలో కృతి సనన్ కోర్టును ఆశ్రయించారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.